Follow: @ANNTELUGU

19-03-2026

ANN తెలుగు

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్  సంపుటి- 23  సంచిక- 82  పేజీలు-08  వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI  REGISTERED NUMBER: APTEL/2003/09316  WWW.EPAPER.MAHAADAILY.COM




## నాలుగు దశాబ్దాల రాజకీయ యాత్ర...

### ప్రజా నిబద్ధతకు ప్రతీక

**పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ 40 ఏళ్ళ రాజకీయ ప్రస్థానం**


రాజకీయాల్లో స్థిరత్వం సాధించడం సులభం కాదు. కాలానుగుణంగా మారుతున్న పరిస్థితుల్లోనూ, ప్రజల అంచనాలను అందుకుంటూ ముందుకు సాగడం ఒక నాయకుడి అసలు పరీక్ష. అలాంటి పరీక్షలను ఎదుర్కొంటూ, నాలుగు దశాబ్దాల పాటు ప్రజా జీవితంలో చురుకుగా కొనసాగిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ రాజకీయ ప్రస్థానం స్ఫూర్తిదాయకమైనది.

- అమరవాజీ నాగరాజు, టీపీసీసీ ప్రెసిడెంట్ పీఆర్ఓ

ప్రత్యేక కథనం 4లో

టాప్ న్యూస్

### నేడే తెలంగాణ బడ్జెట్



- రూ.3.26 లక్షల కోట్లతో పద్దు
- ఉదయం మంత్రివర్గ భేటీ

02

### తెలంగాణ ప్రజా జాగృతి



- కవిత పార్టీకి లైన్ క్లియర్

02

### కుప్పకూలిన దలాల్ స్ట్రీట్



- ఒక్కరోజే 10 లక్షల కోట్ల సంపద ఆవిరి

02





# కనుల పండుగగా.. సినిమా అవార్డుల వేడుక

### హాలీవుడ్ ప్రమాణాలతో తెలుగు సినిమా

- గద్దర్ అవార్డుల వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మెగాస్టార్ చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కార గౌరవం!
- చిత్రసీమ అభివృద్ధికి ప్రభుత్వం అభయహస్తం
- విజేతల కేరింతలతో పులకించిన హైటెక్స్
- నాగచైతన్య, రష్మికలకు ఉత్తమ నటుల కిరీటం
- బాక్సాఫీస్ విజేతల నుంచి కళాకారుల వరకు సమున్నత సత్కారం



**హైద్రాబాద్, మహా:**

తెలంగాణ చలనచిత్ర రంగ చరిత్రలో ఒక నూతన అధ్యాయం ఆవిష్కృతమైంది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'గద్దర్ చలనచిత్ర పురస్కారాల' ప్రదానోత్సవం హైదరాబాద్‌లోని మాదాపూర్ హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో కన్నుల పండువగా జరిగింది.

మిగతా 2లో

### చిత్ర పరిశ్రమ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత అప్పగించినా తీసుకుంటా...

- మెగాస్టార్ చిరంజీవి సంచలన ప్రకటన
- సీఎం రేవంత్ పై ప్రశంసలు

02

### అవార్డుల వేడుకలో పెద్దలకు అవమానాలు

- ముంబై ఏజెన్సీ సమన్వయలోపం.. నిర్లక్ష్యం
- బాహుబలి విజయేంద్రప్రసాద్ గుర్తుపట్టని నిర్వాహకులు
- సురేష్ బాబు, శ్యాంప్రసాద్ రెడ్డి లాంటి దిగ్గజాలకు వెనుక లైన్
- రష్మిక కూడా షాకిచ్చిన.. నిర్వాహకులు

02

### గద్దర్ అవార్డుల వేదికపై అరుదైన దృశ్యం

- మా ఊరి కోడలు అంటూ రష్మికపై సీఎం రేవంత్ రెడ్డి సరదా వ్యాఖ్యలు!
- నేషనల్ క్రష్‌కు ముఖ్యమంత్రి ప్రత్యేక గౌరవం

02

## మరో ఐదుగురికి పదవులు

- విజయరమణారావు, యెన్నం, వీరేశంకు విప్
- ప్రమోషన్ ఇచ్చిన కాంగ్రెస్ హైకమాండ్
- ఇటీవల పలువురు ఎమ్మెల్యేలకు డీసీసీలు, అనుబంధ విభాగాల బాధ్యతలు
- నియామకాల్లో సీఎం రేవంత్ ముద్ర

**హైదరాబాద్, మహా:**

కాంగ్రెస్ హైకమాండ్ మరో ఐదుగురికి ప్రమోషన్ కల్పించింది. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలకు డీసీసీలు, ఎస్సీ, ఎస్టీ వంటి అనుబంధ విభాగాల బాధ్యతలు అప్పగించిన హైకమాండ్ ఇపుడు ముగ్గురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలకు ప్రమోషన్ ఇచ్చింది. శాసనసభలో ప్రభుత్వ విప్ లుగా మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావులకు కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ ముగ్గురు నేతలు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నవారు కావడంతో పాటు, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమైన బలమైన నాయకులు. బడ్జెట్ సమావేశాల్లో ఏ అంశంపైనైనా అనర్గళంగా మాట్లాడి ప్రతిపక్షాలను చిత్తు చేయగల సత్తా ఈ సీనియర్ల సొంతం. ముఖ్యమంత్రి రేవంత్ ముద్ర నియామకాల్లో స్పష్టంగా కనబడుతోంది.

**మండలిలో ఫైర్ బ్రాండ్స్ కు ప్రమోషన్**

పెద్దల సభ అయిన శాసన మండలిలో యువ రక్తానికి పెద్దపీట వేయడం ద్వారా రేవంత్ రెడ్డి సరికొత్త రాజకీయ సంప్రదాయానికి తెరతీశారు. యువ నాయకుడు బల్మూరి వెంకట్, తనదైన శైలి వాగ్ధాటితో ప్రత్యర్థులపై నిప్పులు చెరిగే ఫైర్ బ్రాండ్ అద్దంకి దయాకర్ లను శాసన మండలిలో ప్రభుత్వ విప్ లుగా నియమించారు. ప్రభుత్వ విధానాలను మండలిలో బలంగా వినిపించడంతో పాటు, పార్టీ పట్ల అత్యంత నిబద్ధత కలిగిన ఈ యువ నేతలు ప్రతిపక్షాల వ్యూహాలను దీటుగా ఎదుర్కొనున్నారు. ఈ నియామకాల ద్వారా యువతకు ప్రాధాన్యం ఇస్తానన్న తన మాటను సీఎం రేవంత్ రెడ్డి అక్షరాలా నిలబెట్టుకున్నారు.

### హరీశ్‌రావుతో ఆయిల్ పామ్ సాగు చేయించే బాధ్యత నాది

- సిద్దిపేట వేదికగా మంత్రి తుమ్మల సంచలన వ్యాఖ్యలు!
- వరి సాగుకు కాలం చెల్లింది.. పామాయిల్ తోటలతోనే రైతులకు సిరులు..
- అదనపు బియ్యంపై కేంద్రం నోటీసులు..
- రాష్ట్రంలో పంట మార్పిడి దిశగా రైతులను నడిపిస్తాం

02








## ఉగాది వేళ రైతులకు వరం..

- త్వరలోనే సాదా బైనామా భూములకు శాశ్వత పరిష్కారం
- రైతు రాజు కావాలన్నదే మా లక్ష్యం
- శ్రీ పరాభవ నామ ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి ప్రతి రైతును రాజుగా నిలబెట్టాలన్న దృఢ సంకల్పంతో ముందుకు వెళుతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు.

మిగతా 2లో

## పరాభవం వారికే...

**ఉగాది పంచాంగంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆసక్తికర విశ్లేషణ**

**బీజేపీ కార్యాలయంలో ఉగాది కళ**



**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఉగాది శోభతో కళకళలాడింది. 'శ్రీ పరాభవ నామ సంవత్సర' ఉగాది వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలుగు ప్రజలందరికీ నూతన తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పండితులు వినిపించిన పంచాంగ శ్రవణం అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో

# కనుల పండుగగా.. సినిమా అవార్డుల వేడుక

(మొదటిపేజీ తరువాయి)

ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగిన నంది అవార్డుల స్థానంలో, ప్రజా యుద్ధనౌక గద్దర్ పేరిట ఈ పురస్కారాలను ప్రవేశపెట్టి, కళాకారులకు పట్టాభిషేకం చేయడం విశేషం. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ బృహత్తర వేడుకకు ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు తన చేతుల మీదుగా అవార్డులను అందజేయడంతో హైటెక్స్ ప్రాంగణం చప్పట్లు, కేరింతలతో పులకించిపోయింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, టూరిం మంత్రి జూపల్లి క్రిష్ణారావు, ఐ అండ్ పీఆర్ కమిషనర్ ప్రియాంక, తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, సినీ పరిశ్రమ అభివృద్ధికి తమ ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటునందిస్తుందని, ముఖ్యంగా కళాకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని భరోసా ఇచ్చారు. హాలీవుడ్ స్థాయి సినిమాలు కూడా హైదరాబాద్ వైపు చూడాలన్న తమ కోరిక నెరవేరుతున్నదన్నారు. ఇటీవల నెట్ ఫ్లిక్స్ ఐలైన్ ప్రారంభమైందన్నారు. అవార్డుల వేడుక కన్నులపండుగగా జరగడం అభినందనీయమ్నారు. అర్థవంతమైన సినిమాలకు, సామాజిక స్పృహ ఉన్న కళాకారులకు ఈ వేదిక ద్వారా దక్కే గౌరవం భవిష్యత్తులో మరిన్ని నాణ్యమైన చిత్రాలు రావడానికి దారితీస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం




చేశారు. 2025 క్యాలెండర్ ఏడాదిలో సెన్సార్ బోర్డు నుంచి ధృవీకరణ పొంది, వెండితెరపై మ్యాజిక్ చేసిన చిత్రాల నుంచి అత్యుత్తమ విజేతలను జ్యూరీ సభ్యులు అత్యంత పారదర్శకంగా ఎంపిక చేశారు. ఈ వేడుకలో భాగంగా జ్యూరీ సభ్యుల నిరంతర కృషిని అభినందిస్తూ వారికి ప్రత్యేక జ్ఞాపికలతో పాటు నగదు పురస్కారాలను కూడా ప్రభుత్వం అందజేసింది.

**మెగాస్టార్ కు అత్యున్నత పురస్కారం**

తెలుగు సినీ చరిత్రలో తనదైన ముద్ర వేసిన మెగాస్టార్ చిరంజీవికి ఈ వేదికపై అత్యున్నతమైన 'ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని' ప్రదానం చేయడం అత్యంత ప్రధాన ఘట్టంగా నిలిచింది. చిరంజీవి సినీ ప్రస్థానాన్ని, ఆయన చేసిన సామాజిక సేవలను కొనియాడుతూ ముఖ్యమంత్రి ఈ గౌరవాన్ని అందించారు. మరోవైపు, విలక్షణ నటనకు మారుపేరుగా నిలిచిన విశ్వనటుడు కమల్ హాసన్‌కు 'పైడి జైరాజ్ పురస్కారాన్ని' అందజేసి సత్కరించారు. చిత్ర పరిశ్రమలోని ఇద్దరు దిగ్గజాలు ఒకే వేదికపై గౌరవం పొందడం అభిమానులకు కనువిందు కలిగించింది. అలాగే సాహిత్య రంగంలో తన అద్భుతమైన కలంతో ప్రజల్లో చైతన్యాన్ని రగిలించే సుద్దాల అశోక్ తేజకు 'సినారె పురస్కారం' దక్కడం ఈ వేడుకలో మరో ఆకర్షణగా నిలిచింది. నటనలో ప్రతిభ కనబరిచిన యువ తరానికి కూడా ఈ వేదికపై సముచిత స్థానం లభించింది. 'తండేల్' చిత్రంలో ఒక జాలరి పాత్రలో పరకాయ ప్రవేశం చేసిన యువ సామ్రాట్ నాగచైతన్యకు ఉత్తమ నటుడు పురస్కారం దక్కింది. అదేవిధంగా 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాలో సహజసిద్ధమైన నటనతో మెప్పించిన రష్మిక మందన్న ఉత్తమ నటిగా కిరీటాన్ని అందుకున్నారు. పౌరాణిక మరియు సామాజిక అంశాల కలబోతగా తెరకెక్కిన 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రం ఉత్తమ సినిమాగా నిలిచి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ చిత్రంతో పాటు 'ఛాంపియన్' సినిమా కూడా పలు విభాగాల్లో అవార్డులను గెలుచుకుని తన సత్తాను చాటుకుంది. విద్యుత్ దీపాల వెలుగులు, సాంస్కృతిక ప్రదర్శనలతో సరికొత్త శోభను సంతరించుకున్న ఈ వేడుక తెలుగు చిత్ర పరిశ్రమలో ఒక నూతన శకానికి నాంది పలికింది.

## అవార్డుల వేడుకలో పెద్దలకు అవమానాలు

**హైదరాబాద్, మహా:** హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల వేడుక వైభవంగా జరగ్గా, ఈవెంట్‌లో సమన్వయం లోపం అతిథులని అవమానించింది. గత ఏడాది హైదరాబాద్ కు చెందిన ఏజన్సీకి ఈవెంట్ అప్పగించగా, ఈ ఏడాది దిల్ రాజు ఏరికోరి రూ.11కోట్లతో ముంబైకి చెందిన ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థకు ఈ వేడుక బాధ్యతలను అప్పగించినట్లు చర్చ ఉంది. అయితే ముంబైకి సంబంధించిన సంస్థతో దిల్ రాజు టీమ్ కలిసి పెద్దలను చిన్నబుచ్చుకునేలా చేశారన్న విమర్శలున్నాయి. ముంబైకి సంబంధించిన టీమ్ అతిథులను, అవార్డు గ్రహీతలను గుర్తించక, వారి పేర్లు తెలియక రెడ్ కార్పెట్ దగ్గర సతమతమయ్యారట. అతిథుల పేర్లు తెలియక వారిని ఎంట్రీ వద్దే నిలిపేశారట. రాజ్యసభ సభ్యుడు, బాహుబలి ట్రిపుల్ ఆర్, భజరంగీభాయ్ జాన్ లాంటి అద్భుతాల రచయిత విజయేంద్ర ప్రసాద్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ సభ్యుల తీరుకు విసిగిపోయి అలిగి కార్యక్రమం నుంచి వెళ్ళిపోయారు. ఆడిటోరియంలో ఏర్పాట్లు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయని, అతిథులకు కూర్చోవడానికి సీట్లు కూడా లేని పరిస్థితి ఉందని నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. నేషనల్ క్రష్ రష్మిక మందన్న బౌన్సర్లకు దిల్ రాజు పిఎకు మధ్య మాటామాటా పెరిగింది. బౌనర్స్ కు సర్దీ చెప్పి దిల్ రాజు సిబ్బందిని బయటకు వెళ్లమని ఈవెంట్ ఆర్గనైజర్స్ సూచించారు. అలాగే ఫిలిం ఛాంబర్ ప్రెసిడెంట్, నిర్మాత డి.సురేష్ బాబు, నిర్మాత శ్యాంప్రసాద్ రెడ్డిను సైతం ఈవెంట్ ఆర్గనైజర్స్ వెనుక వరుసలోకి పంపారు. ఇలా అనేక సంఘటనలు సినీప్రముఖులను షాక్ కు గురిచేసి చేదు అనుభవాలు మిగిల్చాయి. గత ఏడాది ఈవెంట్ బాగా నిర్వహించగా, ఈఏడాది అతి జోక్యం టేకిట్ ఈజీగా తీసుకోవడం, ప్రైవేట్ పెత్తనం, స్థానికులు కాకపోవడంతో కోట్లు ఖర్చుచేసినా.. ఇబ్బందులు తప్పలేదు.

## గద్దర్ అవార్డుల వేదికపై అరుదైన దృశ్యం

**హైదరాబాద్, మహా:** తెలంగాణ గడ్డపై ప్రజా యుద్ధనౌక గద్దర్ స్మారకార్థం ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదానోత్సవం సినీ, రాజకీయ దిగ్గజాల కలయికతో ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. హైదరాబాద్ వేదికగా జరిగిన ఈ వేడుకలో కళాకారుల ప్రతిభను గౌరవించే క్రమంలో ఎన్నో మధురమైన, ఆసక్తికరమైన సన్నివేశాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా నేషనల్ క్రష్ రష్మిక మందన 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రంలో కనబరిచిన అద్భుత నటనకు గానూ ఉత్తమ నటి పురస్కారాన్ని అందుకోవడం ఈ సాయంత్రానికే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రష్మిక ఈ అవార్డును అందుకుంటున్న సమయంలో వేదికపై ఒక సరదా సంభాషణ అందరినీ ఆశ్చర్యపరిచింది. అవార్డు అందజేస్తూనే పక్కనే ఉన్న స్టార్ యాంకర్ సుమతో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "రష్మిక మందన మన ఊరి కోడలు తెలుసా?" అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి నోట ఈ మాట వినగానే రష్మిక ముఖంలో ఆనందం వెల్లివిరియగా, సభికులంతా చప్పట్లతో ఈ సరదా క్షణాన్ని ఎంజాయ్ చేశారు. అనంతరం రష్మిక స్పందిస్తూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోవడం తన కెరీర్‌లో అత్యంత స్పెషల్ అని, ఈ క్షణం తన గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ వేడుక కేవలం అవార్డులకే పరిమితం కాకుండా, భారతీయ సినీ పరిశ్రమలోని హేమాహేమీల సమక్షంలో ఒక వేడుకలా సాగింది. మెగాస్టార్ చిరంజీవి దంపతులు, విశ్వనటుడు కమల్ హాసన్, అక్కినేని నాగార్జున దంపతులు ఒకే వేదికపై మెరవడంతో అభిమానుల కళ్లు కాయలు కాచాయి. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, అక్కినేని నాగచైతన్య తన సతీమణితో కలిసి విచ్చేయగా, ఖుష్బూ, అల్లు అరవింద్ వంటి ప్రముఖులు ఈ వేడుకకు నిండుతనాన్ని తీసుకువచ్చారు. తెలంగాణ సంస్కృతిని, కళలను ప్రతిబింబిస్తూ సాగిన ఈ అవార్డుల కార్యక్రమం సినీ కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అతిపెద్ద గౌరవంగా నిలిచిపోయింది.

## హరీశ్‌రావుతో ఆయిల్ పామ్ సాగు చేయించే బాధ్యత నాది

- సిద్దిపేట వేదికగా మంత్రి తుమ్మల సంచలన వ్యాఖ్యలు!
- వరి సాగుకు కాలం చెల్లింది.. పామాయిల్ తోటలతోనే రైతులకు సిరులు..
- అదనపు బియ్యంపై కేంద్రం నోటీసులు..
- రాష్ట్రంలో పంట మార్పిడి దిశగా రైతులను నడిపిస్తాం

**సిద్దిపేట, మహా:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ ముఖచిత్రం మారాల్సిన సమయం ఆసన్నమైందని, సంప్రదాయ వరి సాగును వీడి రైతులు వాణిజ్య పంటల వైపు మళ్లాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం సిద్దిపేట జిల్లా నర్మెట్టలోని ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో నిర్వహించిన భారీ రైతు మేళాలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లు మరియు భవిష్యత్తులో చేపట్టబోయే కార్యాచరణపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా సిద్దిపేట ప్రాంతానికి చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును ఉద్దేశించి మంత్రి తుమ్మల చేసిన వ్యాఖ్యలు సభలో అందరినీ ఆకట్టుకున్నాయి. "స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావుతో ఆయిల్ పామ్ సాగు చేయించే బాధ్యత నాది" అని పేర్కొంటూ, ప్రజాప్రతినిధులు ఆదర్శంగా నిలిచినప్పుడే రైతులు కొత్త పంటల వైపు ధైర్యంగా అడుగులు వేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వరి సాగు విపరీతంగా పెరిగిపోవడం వల్ల భవిష్యత్తులో కలగబోయే ఇబ్బందులను మంత్రి సోదాహరణంగా వివరించారు. తెలంగాణ ఇప్పటికే దేశంలోనే అత్యధికంగా వరి పండించే రాష్ట్రంగా రికార్డు సృష్టించిందని, అయితే మార్కెటింగ్ పరంగా కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతికూల సంకేతాలు వస్తున్నాయని ఆయన వెల్లడించారు. తెలంగాణ నుండి అదనపు బియ్యాన్ని సేకరించే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రానికి స్పష్టమైన నోటీసులు జారీ చేసిందని ఆయన ఉటంకించారు. వరి సాగుకు అవసరమైన నీటి వసతి లేని ప్రాంతాల్లో కూడా రైతులు అదే పంటను సాగు చేస్తూ నష్టపోతున్నారని, ఈ ధోరణిని మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. కేంద్రం నుంచి వచ్చిన లేఖను దృష్టిలో ఉంచుకుని, రైతులు తమ పంటా విధానాన్ని మార్చుకోకపోతే రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని మంత్రి హెచ్చరించారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా పామాయిల్ సాగును ఒక గొప్ప ప్రత్యామ్నాయంగా మంత్రి తుమ్మల ప్రతిపాదించారు. పామాయిల్ సాగు



చేసే రైతులకు ప్రభుత్వం తరపున అడుగడుగునా ప్రోత్సాహం లభిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం ఒక ఎకరాకు రూ. 51,000 చొప్పున భారీ ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం అందిస్తోందని, రైతులు తాము పండించిన పంటను అమ్ముకోవడానికి ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. కంపెనీ ప్రతినిధులే నేరుగా రైతుల ఇళ్ల వద్దకు వచ్చి పంటను సేకరించేలా ఏర్పాట్లు చేశామని, పంట సేకరించిన కేవలం మూడు రోజుల్లోనే రైతు ఖాతాలోకి నగదు జమ అవుతుందని వివరించారు. ఇతర పంటలతో పోలిస్తే పామాయిల్‌లో తక్కువ శ్రమతో ఎక్కువ ఆదాయం పొందే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. రైతులు తమ ఆదాయాన్ని మరింత పెంచుకోవడానికి పామాయిల్ తోటలలో కోకో వంటి అంతర పంటలను సాగు చేయాలని మంత్రి సూచించారు. దీనివల్ల ఒకే భూమి నుండి రెండు రకాల లాభాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వరి కాకుండా ఇతర వాణిజ్య పంటలను ఎంచుకునే రైతులకు మరిన్ని అదనపు రాయితీలు, ప్రోత్సాహకాలు అందించేలా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి, ప్రత్యామ్నాయ పంటల సాగును ఒక ఉద్యమంగా మారుస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు.

## ఉగాది వేళ రైతులకు వరం



(మొదటిపేజీ తరువాయి)

శ్రీ పరాభవ నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆయన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రకృతి వైపరీత్యాలు దరిచేరకుండా ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని భగవంతుడిని మనసారా ప్రార్థించారు. అనంతరం ప్రముఖ సిద్ధాంతి డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి రచించిన శ్రీ పరాభవ నామ ఉగాది పంచాంగాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించి, ఆయనచే పంచాంగ శ్రవణం ఆసాంతం ఆలకించారు. ఈ వేడుకల వేదికగా రాష్ట్ర రైతాంగానికి ముఖ్యమంత్రి పలు కీలక హామీలు, తీపి కబుర్లు అందించారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ రైతులను ఒక భూతంలా పట్టి పీడిస్తోందని విమర్శించిన ఆయన, ఆ ధరణిని తరిమికొట్టి దాని స్థానంలో 'భూ భారతి' విధానాన్ని పకడ్బందీగా అమలు చేసి భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఎంతోకాలంగా రైతులు ఎదురుచూస్తున్న సాదా బైనామా భూములకు సంబంధించి అతి త్వరలోనే ఒక స్పష్టమైన పరిష్కారం చూపించబోతున్నామని ఆయన ఉగాది కానుకగా ప్రకటించారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఎన్ని వచ్చినా, ఐటీ రంగం ఎంతగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ఇప్పటికీ తెలంగాణకు ప్రధాన జీవనాధారం వ్యవసాయమేనని ఆయన గుర్తుచేశారు. రైతులు సంతోషంగా ఉన్నప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, ఈ క్రమంలోనే సంక్షోభంలో ఉన్న రైతులను గట్టెక్కించేందుకు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు అదనంగా బోనస్ కూడా అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆయన వివరించారు. రైతుల ఆర్థిక పురోగతికి సంబంధించి తమ ప్రభుత్వం సాధించిన విజయాలను సీఎం ఈ సందర్భంగా సగర్వంగా ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తాజా లెక్కల ప్రకారం దేశంలో అతితక్కువ రుణభారం కలిగిన రైతులున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం 25.35 లక్షల రైతు కుటుంబాలకు సంబంధించి దాదాపు రూ. 20,616 కోట్ల మేర రూ. 2 లక్షల రుణమాఫీని పూర్తిచేసి, రైతులు ఆత్మగౌరవంతో బతికేలా చేశామని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రతి ఎకరాకు రూ. 12 వేల చొప్పున రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్నామని, ఇప్పటికే రూ. 18 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని, ఈ నెల 22న మిగిలిన రైతు భరోసా సాయాన్ని కూడా అందించబోతున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్, రైతు బీమా అమలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం వంటి నిర్ణయాలన్నీ రాష్ట్ర ఖ్యాతిని జాతీయ స్థాయిలో పెంచుతాయన్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ ముగింపులో వివిధ ఆలయాలకు చెందిన అర్చక స్వాములను ముఖ్యమంత్రి ఘనంగా సత్కరించారు.



## తెలంగాణ ప్రజా జాగృతి

### కవిత పార్టీకి లైన్ క్లియర్

**హైదరాబాద్, మహా:** కల్వకుంట్ల కవిత స్థాపించతలపెట్టిన 'తెలంగాణ ప్రజా జాగృతి' పార్టీ నమోదు వ్యవహారంలో ఎదురైన అడ్డంకులు తొలగిస్తూ ఢిల్లీ హైకోర్టు ఆమెకు భారీ ఊరటనిచ్చింది. ఈ పార్టీ రిజిస్ట్రేషన్ విషయంలో జాప్యం చేయకుండా వీలైనంత త్వరగా తుది నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీ) న్యాయస్థానం ఆదేశించింది. గతంలో కవిత దాఖలు చేసిన పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తులో పలు సాంకేతిక లోపాలు ఉన్నాయంటూ ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఆ ప్రక్రియను నిలిపివేసిన విషయం తెలిసిందే. అయితే, ఈసీ లేవనెత్తిన ప్రతి చిన్న లోపాన్ని, సాంకేతిక సమస్యను తమ క్లయింట్ అత్యంత పకడ్బందీగా సరిదిద్దారని కవిత తరపు న్యాయవాదులు తాజాగా హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పాత దరఖాస్తులోని తప్పులన్నింటినీ సవరించి, ఈసీ నిబంధనలకు అనుగుణంగా పూర్తి స్థాయి పత్రాలతో మళ్లీ సరికొత్తగా దరఖాస్తు చేసినట్లు న్యాయస్థానంలో స్పష్టం చేశారు. కవిత న్యాయవాదుల వాదనలతో ఏకీభవించిన కోర్టు.. ఈ ప్రక్రియను ఇక ఏమాత్రం సాగదీయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్నికల సంఘానికి సూచించింది. హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో ఎన్నికల సంఘం కూడా సానుకూలంగా స్పందించింది. సవరించిన తాజా దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, 'తెలంగాణ ప్రజా జాగృతి' పార్టీ నమోదు వ్యవహారంపై అతి త్వరలోనే తమ తుది నిర్ణయాన్ని వెలువరిస్తామని ఈసీ న్యాయస్థానానికి హామీ ఇచ్చింది. దీంతో ఇన్నాళ్లుగా పార్టీ రిజిస్ట్రేషన్ చుట్టూ అలుముకున్న సందిగ్ధతకు దాదాపుగా తెరపడినట్లయింది. ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పుతో.. ఎన్నికల సంఘం నుంచి అధికారికంగా గ్రీన్ సిగ్నల్ రావడం లాంఛనమేనని స్పష్టమవుతోంది. త్వరలోనే కవిత తన కొత్త రాజకీయ ప్రయాణాన్ని అధికారికంగా ప్రారంభించి, తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై సంచలనాలకు రెడీ అవుతోంది.

## కుప్పకూలిన దలాల్ స్ట్రీట్

### ఒక్కరోజే 10 లక్షల కోట్ల సంపద ఆవిరి




**ఢిల్లీ, మహా:** దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. యుద్ధ భయాలు మదుపరులను తీవ్ర ఆందోళనకు గురిచేశాయి. అమ్మకాల ఒత్తిడితో సూచీలు భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. కేవలం ఒక్కరోజులోనే పెట్టుబడిదారుల సంపద సుమారు రూ. 10 లక్షల కోట్లు ఆవిరైంది. సెన్సెక్స్ 2496 పాయింట్లు నష్టపోయి 74,207 వద్ద, నిఫ్టీ 775 పాయింట్లు తగ్గి 23,002 వద్ద ముగిశాయి. కరోనా సమయంలో (మార్చి 2020) వచ్చిన పతనం తర్వాత మళ్లీ ఈ స్థాయిలో నష్టాలు రావడం మార్కెట్ వర్గాలను కలవరపెడుతోంది.

**మార్కెట్ల పతనానికి ప్రధాన కారణాలు**

అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలే మార్కెట్ల పతనానికి ప్రధాన కారణం. గల్ఫ్ దేశాల్లోని చమురు, గ్యాస్ క్షేత్రాలపై దాడులు జరుగుతాయనే వార్తలు ప్రపంచ మార్కెట్లను ఆందోళనకు గురిచేశాయి. యుద్ధం వస్తే ప్రపంచవ్యాప్తంగా వస్తువుల సరఫరాకు ఆటంకం కలుగుతుందనే భయంతో పెట్టుబడిదారులు తమ షేర్లను పెద్ద ఎత్తున విక్రయించారు.

**పెరిగిన ముడి చమురు ధరలు**

యుద్ధ వాతావరణం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు (క్రూడాయిల్) ధరలు భారీగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 118 డాలర్లు దాటగా, ఇతర క్రూడ్ ఆయిల్ ధరలు 120 డాలర్లకు పైగా చేరుకున్నాయి. చమురు ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం (ధరల పెరుగుదల) ఎగబాకి, భారత ఆర్థిక వృద్ధిపై ప్రభావం చూపుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మన దేశం ఎక్కువగా చమురు దిగుమతులపై ఆధారపడినందున, ఈ పరిణామం దేశీయ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది.

**రూపాయి పతనం, వెనక్కి వెళ్తున్న పెట్టుబడులు**

చమురు ధరల పెరుగుదలకు తోడు, అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ రికార్డు స్థాయికి పడిపోవడం మార్కెట్లపై అదనపు భారాన్ని మోపింది. డాలర్ బలపడటం, మార్కెట్లలో అనిశ్చితి నెలకొనడంతో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ నిధులను వెనక్కి తీసుకుంటున్నారు. బ్యాంకింగ్, ఆటోమొబైల్ తదితర అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ వంటి పెద్ద కంపెనీల షేర్లు కూడా నష్టాలను నమోదు చేశాయి.

## చిత్ర పరిశ్రమ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** సినిమా అవార్డులను మళ్లీ పునరుద్ధరించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను ఎప్పుడు కలిసినా చిత్ర పరిశ్రమ అభివృద్ధి గురించే మాట్లాడుతారని గుర్తు చేశారు. దేశ జీడీపీ పెరగడానికి చిత్ర పరిశ్రమ ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. ఇండియన్ సినిమా అంటే.. తెలంగాణ గుర్తుకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి అంటారని మెగాస్టార్ తెలిపారు. కళాకారులను ఉత్సాహపరచడంలో పక్క రాష్ట్రం కొంత వెనుకంజలో ఉందన్నారు. సినిమా వాళ్లకు దగ్గరగా ఉండే చంద్రబాబు దీనిని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. చిత్ర పరిశ్రమ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ఏ బాధ్యత అప్పగించినా తాను బాధ్యత తీసుకుంటానని మెగాస్టార్ చిరంజీవి అన్నారు.

## నేడే తెలంగాణ బడ్జెట్

- రూ.3.26 లక్షల కోట్లతో పద్దు
- ఉదయం మంత్రివర్గ భేటీ

**హైదరాబాద్, మహా:** ఆర్థికశాఖా మంత్రిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మూడోసారి బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు. 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రోజున అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు రెడీ అయింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా.. ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ చర్యలు చేపట్టింది. ఈ ఏడాది బడ్జెట్ రూ.3.26 లక్షల కోట్లు ఉండొచ్చని సంబంధిత అధికారుల ద్వారా తెలుస్తోంది. అయితే తెలంగాణలో కీలకమైన సంక్షేమం, వ్యవసాయం, నీటి పారుదల రంగాలకు బడ్జెట్‌లో కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట వేయనున్నట్లు.. ఈ రంగాలకు భారీగా కేటాయింపులు చేయనున్నట్లు సమాచారం. తెలంగాణ విజన్2047 డాక్యుమెంట్ అమలు దిశగా ప్రత్యేకంగా నిధులను కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఈ బడ్జెట్‌పై శుక్రవారం ఉదయం 9.30 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రి వర్గ సమావేశం జరగనుంది. ఈ భేటీ తర్వాత బడ్జెట్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది.

## పరాభవం వారికే...

### ఉగాది పంచాంగంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆసక్తికర విశ్లేషణ

### బీజేపీ కార్యాలయంలో ఉగాది కళ



(మొదటిపేజీ తరువాయి)

కొత్త ఏడాది పేరు 'పరాభవ' అని ఉండటంపై కిషన్‌రెడ్డి ఒక విభిన్నమైన విశ్లేషణ ఇచ్చారు. "పరాభవం అనే పదం మన దేశానికి కానీ, ధర్మాన్ని నమ్మే మన ప్రజలకు కానీ వర్తించదు. ఈ పరాభవం కేవలం భారతదేశ ఎదుగుదలను ఓర్వలేని శత్రువులకు, దేశద్రోహులకు మాత్రమే ఎదురవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. పుణ్యభూమి అయిన భారతావనిలో ఈ ఏడాది శుభ ఫలితాలే రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. పండితులు వివరించిన పంచాంగం ప్రకారం... ఈ ఏడాది దేశ భవిష్యత్తు ఎంతో ఆశాజనకంగా ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండుతాయని, రైతులు సుఖసంతోషాలతో ఉంటారని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలతో సతమతమవుతున్నా, ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ మాత్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని గుర్తు చేశారు. ఉగాది పచ్చడిలోని షడ్రుచులు మన జీవితానికి ప్రతీక అని, తీపివగరుచేదు అన్నీ కలిస్తేనే జీవితమని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా, 140 కోట్ల మంది భారతీయులు ఐక్యంగా నిలబడితే ఏ సమస్యనైనా అధిగమించవచ్చని అన్నారు.

## అంబులెన్స్ లో ప్రసవం – తల్లి, శిశువు సురక్షితం



**దమ్మపేట,మహా :** అంబులెన్స్ లో ప్రసవం కాబడి ,తల్లీ శిశువులను సురక్షితంగా కాపాడిన ఘటన మండల పరిదిలోని గండుగులపల్లి లో తెలుగు ఉగాది సంవత్సరం రోజున చోటుచేసుకుంది. వివరాలు పరిశీలన చేస్తే..దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామానికి చెందిన తాటి కృష్ణకుమారి ప్రసవ వేదనలతో బాధ పడుతుండగా 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే దమ్మపేట 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు.ఇ.యమ్.టి. చీమల రాము పరీక్షించగా ఆమెకు తీవ్ర ప్రసవ వేదనలు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఆమెను అంబులెన్స్‌లోకి తీసుకుని వైద్య పరీక్షలు చేసిఆసుపత్రికి తరలిస్తుండగా కృష్ణకుమారి ప్రసవ వేదనలు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లోనే సురక్షితంగా పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉండగా, అనంతరం సమీప దమ్మపేట ఆసుపత్రికి తరలించారు. అత్యవసర సమయంలో చాకచక్యంగా స్పందించిన ఇ.యమ్.టి. చీమల రాము , పైలట్ లాల్‌సింగ్‌ను స్థానికులు అభినందించారు.

# వాహన తనిఖీల్లో పట్టుబడ్డ గంజాయి

### 52,77,000 విలువైన గంజాయి పోలీసుల స్వాధీనం

**పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు, రెండు కార్లు, నాలుగు సెల్ ఫోన్లు**

**పరారీలో మరో ముగ్గురు.. వివరాలు వెల్లడించిన డిఎస్పి ఆదినారాయణ**




**జూలూరుపాడు, మహా:** జూలూరుపాడు పోలీస్, సిసిఎస్ పోలీస్ సంయుక్తంగా బుధవారం మండల పరిధిలో నిర్వహించిన వాహన తనిఖీల్లో 105.54 కేజీల ప్రభుత్వ నిషేధిత గంజాయి పోలీసులకు పట్టుబడింది. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ పాల్గొని వివరాలను వెల్లడించారు. డీఎస్పీ ఆదినారాయణ తెలిపిన వివరాల ప్రకారం నమ్మదగిన సమాచారం మేరకు జూలూరుపాడు పోలీస్, సిసిఎస్ పోలీసులు స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానస్పదంగా కనిపించిన టిఎస్ 11 ఈ ఆర్ 6312, టీఎస్ 07 జే వై 3959 నంబర్ గల రెండు కార్లలో ముగ్గురు వ్యక్తులు వస్తూ ఉండగా, అట్టి కార్లను ఆపి, తనిఖీ చేయడం జరిగినది. వారి దగ్గర నుండి 52 గంజాయి ప్యాకెట్లు సుమారుగా, 105.54 కేజీల ఎండు గంజాయి పట్టుబడినట్లు డిఎస్పి తెలిపారు. పట్టుబడిన గాంజాయి విలువ 52 లక్షల 77 వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను విచారించగా ఆంధ్ర రాష్ట్రం కలిమెళ్ళి, దొంకరాయి ప్రాంతం నుండి నిషేధిత ఎండు గంజాయిని ప్యాకెట్లుగా తరలిస్తూ, భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, జూలూరుపాడు, ఖమ్మం, హైదరాబాద్ మార్గంగా షిరిడీ కి విక్రయించేందుకు భద్రాచలం నుండి హైద్రాబాద్ కు వెళ్తున్నారని తెలిపారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడ్డ నల్లగొండ జిల్లా మర్రిగూడెం గ్రామానికి చెందిన శివాకర్ ప్రమోద్ కుమార్, నల్లగొండ జిల్లా దేవరకొండ గ్రామానికి చెందిన బైరిశెట్టి భార్గవ్, రంగారెడ్డి జిల్లా వనస్థలిపురానికి చెందిన అందేకర్ శ్రీనివాస్ ను అదుపులోకి తీసుకోవడంతో పాటు, రవాణాకు వాడిన రెండు కార్లు, నాలుగు సెల్ ఫోన్ లను స్వాధీన పరుచుకున్నామన్నారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు అభి, లక్ష్మణ్, షారుక్ లు పరారీలో ఉన్నట్లు డిఎస్పి తెలిపారు. తదుపరి విచారణలో ఇట్టి గంజాయిని కొనుగోలు చేసిన మరియు అమ్మిన వ్యక్తుల పై కేసులు నమోదు చెయ్యడం జరుగుతుందన్నారు. 2025 జనవరి నుండి ఇప్పటివరకు సుమారుగా 86 కేసులలో 34 కోట్ల 7 లక్షల రూపాయల విలువ గల 6844 కిలోల గంజాయిని జిల్లా పోలీసులు స్వా ధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అంతేకాకుండా గంజాయి కేసులతో సంబంధం ఉన్న ముగ్గురు వ్యక్తులపై పీడియాక్టులను నమోదు చేసి జైలుకు తరలించడం జరిగిందన్నారు. మరో ముగ్గురికి సంబంధించిన ఆస్తులను కూడా జప్తు చేయడం జరిగిందని తెలిపారు. మరికొంతమందిపై పీడియాక్టు నమోదు చేసేందుకు పోలీసులు జాబితాను సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఇట్టి గంజాయిని పట్టుకోవడంలో కృషి చేసిన కొత్తగూడెం సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు, బి రవి తోపాటు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు ఆదినారాయణ తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ శ్రీలక్ష్మి, ఎస్సై బి రవి, పి శివరామకృష్ణ, డివి సుబ్బారావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగాది శుభాకాంక్షలతో ఎమ్మెల్యే పాయంను కలిసిన అధికారులు, నేతలు..





**మణుగూరు, మహా :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సందడిగా మారింది. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

**అధికారుల శుభాకాంక్షలు**

ఉదయం జరిగిన కార్యక్రమంలో తాసిల్దార్ నరేష్, డిఎస్పి రవీందర్ రెడ్డి, సిఐ నాగబాబు, ఎస్సై శ్రవణ్ కుమార్ లు ఎమ్మెల్యేను కలసి ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి అభినందనలు తెలియజేసి ప్రజలకు సేవలందించడంలో మరింత కృషి చేయాలని అధికారులకు సూచించారు.

**- కాంగ్రెస్ నాయకుల సందడి..**

స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే పాయంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు సభ్యులు కృష్ణవేణి, సీనియర్ నాయకులు పోలమూరి రాజు, దొబ్బల వెంకటప్పయ్య, కాటబోయిన నాగేశ్వరావు, ఐఎన్టియుసి రాష్ట్ర నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, ఎస్ గణేష్ రెడ్డి, అబ్దుల్లా, రామసుబ్రహ్మణ్యం, భాగం రవి, త్రిమూర్తులు పాల్గొన్నారు.

**మహిళా నేతల శుభాకాంక్షలు..**

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ మహిళా నాయకులు ఎమ్మెల్యే పాయంను మర్యాదపూర్వకంగా కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, స్వరూప మరియు ఇతర మహిళా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేసి, కొత్త సంవత్సరంలో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఉదయం నుంచి ఎమ్మెల్యే పాయంను వరుసగా ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు, నేతలు, ప్రముఖులు స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ ఉండడంతో క్యాంపు కార్యాలయం సందడిగా మారింది.

## బస్సు షెల్టర్ ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు




**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ మండల పరిధిలోని జింకలగూడెం గ్రామంలో ఐటీసీ సిఎస్ఆర్ నిధులు సుమారు 9 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన బస్ షెల్టర్ ను గురువారం పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, ఎంపీడీవో జమలారెడ్డి, ఐటిసి పిఎస్పీడీ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ చెంగల్ రావు, స్థానిక సర్పంచ్ బొర్రా సుభద్ర, అంజనాపురం సర్పంచ్ బానోత్ నరసింహ, పినపాక పట్టి నగర్ సర్పంచ్ బానోత్ పద్మ,మొరంపల్లి బంజర మాజీ ఉపసర్పంచ్ కైపు లక్ష్మీనారాయణ రెడ్డి, షేక్ షరీఫ్, సయ్యత్ సమీర్, షేక్ అబ్దుల్లా, షేక్ షబ్బీర్, షేక్ గులాం, సయ్యద్ రియాజ్ సయ్యద్ అమీర్, చిన్న మదర్,మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు యువజన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కామాక్షి ఏకామేశ్వరిస్వామి దేవాలయ 53వ వార్షికోత్సవం



- **వార్షికోత్సవంలో భక్తులకు మహా అన్నదానం**
- **ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్**

**సత్తుపల్లి, మహా:** మండల పరిధిలోని గంగారం గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆర్థిక సహాయంతో నిర్మించిన శ్రీ కామాక్షి ఏకామేశ్వరి స్వామి ఆలయంలో 53వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉగాది పర్వదినాన ఆలయ వార్షికోత్సవంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మహా అన్నదాన కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ఈ సందర్భంగా మట్టా దయానంద్ మాట్లాడుతూ మహా శక్తి కలిగిన శ్రీ కామాక్షి ఏకామేశ్వరి స్వామి దేవాలయం గంగారం గ్రామ నడిబొడ్డులో కొలువు తీరడం గ్రామ ప్రజల సుకృతమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ దోమ ఆనంద్ బాబు, గంగారం గ్రామ సర్పంచ్ కాకర్ల రేవతి, ఉప సర్పంచ్ బెజవాడ రాధ, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు యామాల ముత్యాలరావు, నాయకులు కొలగట్ల చెన్నారావు, వార్డు సభ్యులు మొగిలిచర్ల మోహన చారి, కావేటి అప్పారావు, కొడపాక గాంధీ, కొండపల్లి మహేష్, బెజవాడ శ్రీనివాసరావు, చెమట వెంకటేశ్వరరావు తదితర నాయకులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రేగాకు బీఆర్ఎస్ శ్రేణుల ఉగాది శుభాకాంక్షలు



**మణుగూరు, మహా :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ను మణుగూరులో పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం మర్యాదపూర్వకంగా కలసి ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రేగా కాంతారావు నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం రేగా కాంతారావు అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్త సంవత్సరంలో ప్రజలకు సుఖశాంతులు, అభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరావు, టౌన్ అధ్యక్షుడు కుంట లక్ష్మణ్, ముద్దంగుల కృష్ణ, ఆడప అప్పారావు, నూకారపు రమేష్, వట్టం రాంబాబు, జావీదు తదితరులు పాల్గొన్నారు.

## జి.ఎం శ్రీనివాస్ కు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన యూనియన్ బాధ్యులు






**సత్తుపల్లి, మహా:** తెలుగు సంవత్సరాది పండుగ ఉగాదిని పురస్కరించుకొని సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ కు ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు సహచర యూనియన్ బాధ్యులతో కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిఎం శ్రీనివాస్ స్పందిస్తూ తెలుగు వారి కొత్త సంవత్సరంగా పిలువబడే ఉగాది పండుగ సందర్భంగా సింగరేణి అధికారులు, కార్మికులు వారి కుటుంబ సభ్యులతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎన్.టి.యు.సి నాయకులు, కార్యకర్తలు, సింగరేణి కార్మిక సిబ్బంది పాల్గొన్నారు.

## మొరంపల్లి బంజరలో పిహెచ్‌సి పునర్నిర్మాణానికి శ్రీకారం



### ప్రజా ఆరోగ్యానికి కొత్త దిశ




**భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని మొరంపల్లి బంజర గ్రామంలో ప్రజల ఆరోగ్య సేవలను మెరుగుపర్చే దిశగా కీలక అడుగు పడింది. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి) పునర్నిర్మాణ పనులను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఘనంగా ప్రారంభించారు.ఈ పునర్నిర్మాణ పనులు హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, ఐటీసీ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధుల ద్వారా సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టడం విశేషం. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణకు ఇది ఒక మంచి ఉదాహరణగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**ఆధునిక సౌకర్యాలతో పిహెచ్‌సి అభివృద్ధి**

పిహెచ్‌సి మరియు ఆయుర్వేద వైద్యశాలలో మెడికల్ గదుల నిర్మాణం, శుభ్రతను మెరుగుపరిచే మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులు పూర్తిచేయబడగా, ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి వాటిని ప్రారంభించారు. ఈ సౌకర్యాల ద్వారా రోగులకు మరింత మెరుగైన చికిత్స అందే అవకాశం ఏర్పడింది.

**సిఎస్ఆర్ నిధుల వినియోగంపై ప్రశంసలు**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, మండల పరిధిలో ఐటీసీ సంస్థ ఉండడం వలన సిఎస్ఆర్ నిధులను విద్య, వైద్య రంగాల్లో సమర్థంగా వినియోగిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను పెంచుతాయని పేర్కొన్నారు.

**వైద్య సిబ్బందిపై ప్రశంసలు**

మొరంపల్లి బంజర పిహెచ్‌సిలో ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదులు రాకపోవడం, వైద్యులు మరియు సిబ్బంది రోగులకు అంకితభావంతో సేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. ప్రజలకు సమయానికి చికిత్స అందించడం వల్ల ఆరోగ్య సమస్యలు తగ్గుతున్నాయని తెలిపారు.

**సంస్థలకు కృతజ్ఞతలు**

పిహెచ్‌సి అభివృద్ధికి సహకరించిన హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా సంస్థ మరియు ఐటీసీ పిఎస్పీడీ సంస్థలకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

**విస్తృతంగా పాల్గొన్న అధికారులు, నాయకులు**

ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీధర్, ఎంపీడీవో జమలారెడ్డి, పంచాయతీరాజ్ డిఇ వెంకటేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వైద్యులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు మరియు స్థానిక ప్రజలు భారీగా పాల్గొన్నారు.మొత్తంగా, మొరంపల్లి బంజరలో పిహెచ్‌సి పునర్నిర్మాణం గ్రామీణ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఒక కీలక మైలురాయిగా నిలుస్తోంది. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే, పరిసర గ్రామాల ప్రజలకు మరింత సమగ్ర వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.




## వీరనారి మల్లు స్వరాజ్యం జీవితం స్ఫూర్తిదాయకం

**సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్.**

**సత్తుపల్లి, మహా:** వీరనారి మల్లు స్వరాజ్యం జీవితం స్ఫూర్తిదాయకమని ఈ తరానికి ఆమె పోరాటం ఆదర్శమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ అన్నారు. గురువారం సిపిఎం సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సత్తుపల్లి ప్రజాసంఘాల కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం నాలుగవ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ తుపాకీ పట్టి నిజాం రాజును కడగల్లాడించిన వీర వనిత మల్లు స్వరాజ్యం అన్నారు. ఆడవాళ్లు అబలలు కాదు సబలలు అని నిరూపించిన యోధురాలు మల్లు స్వరాజ్యం అన్నారు. నమ్మిన ఆశయం కోసం కొట్లాడిన వీర వనిత స్వరాజ్యమని ఆమె ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని అన్నారు. తెలంగాణలో మొట్ట మొదటిగా 13 ఏళ్ల వయసులోనే తుపాకి పట్టిన మహిళల్లో మల్లు స్వరాజ్యం ప్రముఖులనే కీర్తి ఘటించారని అన్నారు.నేడు దేశంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం మహిళల పట్ల చిన్నచూపు చూస్తుందని విమర్శించారు. కేంద్రంలో బిజెపి అధికారులకు వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని వాటిని ఎదుర్కొనేందుకు ప్రతి మహిళ మల్లు స్వరాజ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు.

## లక్ష్యాల దిశగా అడుగులు వేద్దాం



- **ప్రభావనామ సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో సరికొత్త ప్రభావాన్ని చూపాలి**
- **తెలుగు సంస్కృతికి, సంప్రదాయాలకు ఉగాది అసలైన ప్రతిబింబం**
- **నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పునరంకితం అవుతాం**
- **కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ప్రభావ నామ సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో సరికొత్త ప్రభావాన్ని చూపిస్తూ అందరి ఇళ్లు వెలుగులతో నిండాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శ్రీ ప్రభావ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని గురువారం ఆయన నియోజకవర్గ పరిధిలోని పలు దేవాలయాలను సందర్శించి ప్రజలతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసంత కాలం రాకతో ప్రకృతి ఎలాగైతే కొత్త చిగురు తొడుగుతుందో ఈ నూతన సంవత్సరం కూడా ప్రజలందరి జీవితాల్లో సరికొత్త ఆశలను ఆశయాలను చిగురింపజేయాలని ఆకాంక్షించారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి మనకు జీవితంలోని సుఖదుఃఖాలను లాభనష్టాలను సమానంగా స్వీకరించాలనే గొప్ప సందేశాన్ని ఇస్తుందని వివరించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పచ్చని పంటలతో అన్నదాతల ఇళ్లు కళకళలాడాలని రాష్ట్రం ఆర్థికంగా సుభిక్షంగా ఉండాలని నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా సామాజిక ఐక్యతను కాపాడుకుంటూ ముందుకు సాగడమే మన ప్రధాన లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రజలందరికీ మరోసారి ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ అందరి ఇళ్లలో ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు నిండాలని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదపంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, కార్పొరేటర్లు, సర్పంచులు, ఉప సర్పంచులు, ఆలయకమిటీ నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

## లక్ష్మీపురం గ్రామంలో బస్టాండ్ నిర్మించాలి

**బత్తుల వెంకటేశ్వర్లు, సిపిఎం మండల కమిటీ**



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో బస్టాండ్ లేకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం పార్టీ మండల కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి బస్టాండ్ నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వరావు గారిని కోరింది.లక్ష్మీపురం గ్రామం కీలక రహదారి జంక్షన్‌గా ఉండి, మణుగూరు-భద్రాచలం మార్గంలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా లక్ష్మీపురం నుండి బూర్గంపాడు, టేకులచెరువు, బంజారా ప్రాంతాలు, అలాగే మణుగూరు వైపు వెళ్లే రహదారులు ఇక్కడ కలుస్తున్నాయని పేర్కొన్నారు. దీంతో ఈ ప్రాంతంలో బస్టాండ్ అవసరం అత్యంత అత్యవసరమైందని వెల్లడించారు.గ్రామ ప్రజలు చాలా కాలంగా బస్టాండ్ నిర్మాణం కోసం కోరుతున్నప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని సిపిఎం నాయకులు అన్నారు. జింకలగూడెంలో నిర్మించిన విధంగానే లక్ష్మీపురంలో కూడా బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ బూర్గంపాడు మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.

# నాలుగు దశాబ్దాల రాజకీయ యాత్ర...
# ప్రజా నిబద్ధతకు ప్రతీక

## పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ 40 ఏళ్ళ రాజకీయ ప్రస్థానం



రాజకీయాల్లో స్థిరత్వం సాధించడం సులభం కాదు. కాలానుగుణంగా మారుతున్న పరిస్థితుల్లోనూ, ప్రజల అంచనాలను అందుకుంటూ ముందుకు సాగడం ఒక నాయకుడి అసలు పరీక్ష. అలాంటి పరీక్షలను ఎదుర్కొంటూ, నాలుగు దశాబ్దాల పాటు ప్రజా జీవితంలో చురుకుగా కొనసాగిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ రాజకీయ ప్రస్థానం విశ్లేషణకు అర్హమైనది. ఇది కేవలం ఒక వ్యక్తి ఎదుగుదల కథ మాత్రమే కాదు ప్రజాస్వామ్యంలో క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదల కలిసొస్తే సాధ్యమయ్యే ప్రయాణానికి ప్రతీక.


1986లో ఎన్ఎస్‌యూఐ వేదికగా ప్రారంభమైన ఆయన రాజకీయ జీవితం, విద్యార్థి ఉద్యమాల నుంచి ప్రధాన రాజకీయాల వరకు విస్తరించింది. ఆ కాలంలో విద్యార్థి రాజకీయాలు కేవలం క్యాంపస్ పరిమితుల్లోనే కాకుండా, సమాజ సమస్యలను ప్రతిబింబించే వేదికగా ఉండేవి. అలాంటి వాతావరణంలో నాయకత్వ లక్షణాలను అలవర్చుకున్న మహేష్ కుమార్ గౌడ్, విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతూ తన రాజకీయ పునాది బలపరిచారు. నిరుద్యోగం, విద్యా సదుపాయాల కొరత, సామాజిక అసమానతలు వంటి అంశాలను ప్రస్తావిస్తూ యువ నాయకుడిగా గుర్తింపు పొందారు.

విద్యార్థి రాజకీయాల నుంచి ప్రధాన రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా ఆయన తన పోరాట స్ఫూర్తిని కోల్పోలేదు. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై రాజీ పడకపోవడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన చురుకైన పాత్ర ఆయన రాజకీయ చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. ఉద్యమాల్లో నుంచి వచ్చిన నాయకత్వం ప్రజల మనస్సుల్లో నమ్మకాన్ని పెంపొందిస్తుందని చెప్పే వాస్తవాన్ని ఆయన ప్రయాణం మరోసారి నిరూపించింది.

రాష్ట్ర విభజన అనంతరం రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కొత్త సమీకరణాలు, కొత్త సవాళ్లు నాయకత్వాన్ని పరీక్షించే దశగా మారాయి. ఈ సందర్భంలో మహేష్ కుమార్ గౌడ్ తన చురుకుదనాన్ని మరింత పెంచుకున్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసనలు తెలుపుతూ, పార్టీ కార్యకర్తలతో కలిసి నిరంతర పోరాటాలు కొనసాగించారు. పార్టీ పట్ల ఆయన నిబద్ధత, నాయకత్వంపై విశ్వాసం ఈ దశలో మరింత స్పష్టమయ్యాయి.

రాజకీయాల్లో గెలుపోటములు సహజం. కానీ ఓటమిని ఎలా స్వీకరిస్తారు అనేది నాయకుడి పరిపక్వతను నిర్ణయిస్తుంది. ఎన్నికల రాజకీయాల్లో ఎదురైన పరాజయాలు మహేష్ కుమార్ గౌడ్‌ను వెనక్కి నెట్టలేదు. వాటిని ఒక పాఠంగా స్వీకరించి, మరింత బలంగా ముందుకు సాగడం ఆయన ప్రత్యేకత. ప్రజల మధ్యనే కొనసాగుతూ, కార్యకర్తలతో అనుబంధాన్ని పెంచుకోవడం ద్వారా ఆయన తన రాజకీయ బలం పెంచుకున్నారు.

సంస్థాగతంగా కూడా ఆయన పాత్ర విశేషంగా చెప్పుకోవాలి. పీసీసీ కార్యదర్శి, అధికార ప్రతినిధి, ప్రధాన కార్యదర్శి, వర్కింగ్ ప్రెసిడెంట్ వంటి పలు హోదాల్లో పనిచేస్తూ పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేశారు. ప్రతి హోదాలోనూ తనకున్న బాధ్యతను సమర్థంగా నిర్వర్తించడం ద్వారా ఆయన నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించారు. చివరకు టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం ఆయన కృషికి వచ్చిన సహజ ఫలితంగా చెప్పవచ్చు.



-అమరవాజీ నాగరాజు
టీపీసీసీ చీఫ్ పీఆర్ఓ

సామాజిక సమీకరణాల పరంగా కూడా ఆయన ఎదుగుదల ప్రాధాన్యం సంతరించుకుంది. బీసీ వర్గానికి చెందిన నాయకుడిగా రాష్ట్ర స్థాయి నాయకత్వానికి ఎదగడం, కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పట్ల ఉన్న కట్టుబాటును ప్రతిబింబిస్తుంది. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలనే సిద్ధాంతం ఆచరణలో ఎలా కనిపించాలో ఆయన ఎదుగుదల ఒక ఉదాహరణగా నిలుస్తుంది.

వ్యక్తిత్వ పరంగా కూడా ఆయన ప్రత్యేకతను ప్రస్తావించాల్సిందే. క్రీడల పట్ల ఆసక్తి, ముఖ్యంగా కరాటేలో ఉన్నత స్థాయి సాధించడం ఆయన క్రమశిక్షణకు నిదర్శనం. 7వ డాన్ బ్లాక్ బెల్ట్ సాధించడం సాధారణ విషయం కాదు. క్రీడల ద్వారా వచ్చిన నియంత్రణ, ధైర్యం, సహనం వంటి లక్షణాలు ఆయన రాజకీయ జీవితంలో ప్రతిఫలిస్తున్నాయి. తెలంగాణ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడిగా యువతలో క్రమశిక్షణను పెంపొందించే కార్యక్రమాలు చేపట్టడం ఆయన సమగ్ర వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది.

అభివృద్ధి అంశంలో కూడా ఆయన చూపిన చొరవ గమనించదగ్గది. స్వగ్రామ అభివృద్ధి కోసం భూమిని విరాళంగా ఇవ్వడం, విద్యా సంస్థల ఏర్పాటుకు కృషి చేయడం, ప్రాంతీయ మౌలిక వసతుల అభివృద్ధికి దోహదపడడం వంటి చర్యలు ఆయన ప్రజా సేవా దృక్పథాన్ని స్పష్టం చేస్తాయి. ముఖ్యంగా ఆలయాలను కలుపుతూ టెంపుల్ కారిడార్ నిర్మాణానికి కృషి చేయడం ప్రాంతీయ పర్యాటకాభివృద్ధికి దోహదపడే అంశంగా చూడవచ్చు.

నేటి రాజకీయాల్లో సోషల్ మీడియా ప్రభావం విస్తరించినప్పటికీ, ప్రజలతో నేరుగా మమేకమయ్యే నాయకత్వానికి ప్రత్యామ్నాయం లేదనే వాస్తవం స్పష్టంగా కనిపిస్తోంది. మహేష్ కుమార్ గౌడ్ ప్రయాణం ఈ వాస్తవాన్ని మరింత బలపరుస్తుంది. కష్టపడి పనిచేసే కార్యకర్త కూడా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చనే నమ్మకాన్ని ఆయన నిరూపించారు. ఇది నేటి యువతకు ఒక స్పష్టమైన సందేశం.

మొత్తంగా చూస్తే, మహేష్ కుమార్ గౌడ్ రాజకీయ ప్రస్థానం వ్యక్తిగత విజయ గాథ కంటే ఎక్కువ. అది ప్రజాస్వామ్యంలో అవకాశాల సమానత్వానికి ప్రతీక. క్రమశిక్షణ, అంకితభావం, ప్రజల పట్ల బాధ్యత కలిసొస్తేనే నాయకత్వం సార్థకమవుతుందనే సందేశాన్ని ఆయన ప్రయాణం స్పష్టంగా తెలియజేస్తోంది. నాలుగు దశాబ్దాల ఈ రాజకీయ యాత్ర భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలవాలి. వేగంగా మారుతున్న రాజకీయాల్లో విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగడం ఎంత ముఖ్యమో ఈ ప్రయాణం చెబుతోంది. వ్యక్తిగత ప్రయోజనాల కంటే సామూహిక ప్రయోజనాలను ముందుకు పెట్టే నాయకత్వం అవసరమని గుర్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో మహేష్ కుమార్ గౌడ్ ప్రస్థానం సమకాలీన రాజకీయాలకు ఒక దిశానిర్దేశంగా భావించాల్సిన అవసరం ఉంది.



# శాంతి దూత ప్రధాని మోదీ

**పశ్చిమాసియా అగ్నిగుండంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో, ఉద్రిక్తతలను చల్లార్చే శక్తి ఒక్క మోదీకే ఉన్నాయని గల్ఫ్ దేశాలు వినతుల మీద వినతులు చేస్తున్నాయి. ఈ సమస్యను కొలిక్కితెచ్చే సామర్థ్యం ఒక్క మోదీకే ఉంది. యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దౌత్య రంగాన్ని తన భుజాలపై వేసుకున్నారు. గురువారం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిక్, అలాగే మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంలతో ఆయన ఫోన్ ద్వారా జరిపిన అత్యవసర మంతనాలు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ ఫోన్ సంభాషణల్లో ప్రధాని మోదీ ప్రధానంగా శాంతి మంత్రాన్ని జపించారు. పశ్చిమాసియాలో రోజురోజుకూ శృతి మించుతున్న ఉద్రిక్తతలను తక్షణమే తగ్గించి, పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావాలని ఆయన దేశాధినేతలకు స్పష్టం చేశారు. యుద్ధం వల్ల ఏ దేశానికీ ఒరిగేది లేదని, కేవలం సామరస్యపూర్వక వాతావరణంలో జరిగే దౌత్యం ద్వారా మాత్రమే ప్రాంతీయ స్థిరత్వం సాధ్యమవుతుందని మోదీ పునరుద్ఘాటించారు. మోదీ సూచనతో ఏకీభవించిన ఫ్రాన్స్, ఒమన్, మలేషియా నేతలు సైతం ఉద్రిక్తతల తగ్గింపునకు కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరాన్ని అంగీకరించారు.**

## ప్రపంచ ఆర్థికవ్యవస్థపై ప్రభావం

ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత కీలకమైన 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్' జలసంధి గుండా నౌకాయానం ఏమాత్రం నిలిచిపోయినా అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావం చూపుతుంది. ఈ విషయాన్ని గ్రహించిన ప్రధాని మోదీ, ఆ వాణిజ్య మార్గంలో నౌకాయానం స్వేచ్ఛగా, అత్యంత సురక్షితంగా సాగాల్సిన ఆవశ్యకతను ప్రత్యేకంగా నొక్కిచెప్పారు. మరోవైపు, ఒమన్ వంటి దేశాల సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘిస్తూ ఎవరైనా దుశ్చర్యలకు పాల్పడితే సహించేది లేదని, అటువంటి ఉల్లంఘనలను భారతదేశం తీవ్రంగా ఖండిస్తుందని ఆయన తేల్చిచెప్పారు. యుద్ధ వాతావరణంలో చిక్కుకున్న తమ పౌరులను రక్షించుకోవడంలో భారత్ ఎప్పుడూ అప్రమత్తంగానే ఉంటుంది. పశ్చిమాసియా దేశాల్లో ఉన్న వేలాది మంది భారతీయ పౌరుల భద్రతపై ప్రధాని మోదీ ఈ సందర్భంగా ఆరా తీశారు. వారు క్షేమంగా స్వదేశానికి తిరిగి రావడంలో ఒమన్ అందిస్తున్న అసమాన సహకారానికి ఒమన్ సుల్తాన్‌కు మోదీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ తాజా పరిణామాల కంటే ముందే ఇరాన్ అధ్యక్షుడితోనూ ప్రధాని మోదీ మాట్లాడటం గమనార్హం. పశ్చిమాసియా దాడుల్లో సామాన్య పౌరుల ప్రాణనష్టం, మౌలిక సదుపాయాల విధ్వంసం పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్రాన్స్ వంటి మిత్ర దేశాలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, ఆ ప్రాంతంలో శాంతి స్థాపన కోసం భారత్ తన వంతు పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఒకవైపు ఇంతటి తీవ్రమైన దౌత్యపరమైన చర్చలు జరుపుతూనే.. రాబోయే ఈద్ (ఈద్‌ఉల్‌ఫితర్), హరి రాయ ఐడిల్‌ఫిత్రి పండుగల సందర్భంగా ఒమన్, మలేషియా ప్రధానులకు మోదీ శుభాకాంక్షలు తెలిపి తన స్నేహపూర్వక వైఖరిని చాటుకున్నారు.

# సారపాక వేదికగా ఎస్ఐ మేడా ప్రసాద్‌కు ఘన సన్మానం



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలంలోని ఐటీసీ పీఎస్పీడీ సారపాక వేదికగా సబ్ ఇన్స్పెక్టర్ మేడా ప్రసాద్ ని ఘనంగా సన్మానించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మిత్రపక్షాల ప్రతినిధులు మరియు ఐటీసీ సిబ్బంది కలిసి ఆయనకు శాలువా కప్పి ఆత్మీయంగా అభినందనలు తెలియజేశారు.

**సేవలకు గౌరవం – ప్రజా భద్రతకు గుర్తింపు**

బూర్గంపాడు మండలంలో శాంతి భద్రతల పరిరక్షణలో ఎస్ఐ మేడా ప్రసాద్ సమర్థంగా విధులు నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందారని నాయకులు ప్రశంసించారు. నేరాల నియంత్రణ, ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చురుకైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఉగాది శుభాకాంక్షలతో ప్రత్యేక కార్యక్రమం శ్రీ పరాభవనామ సంవత్సర ఉగాది సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఐకి శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్నేహపూర్వక వాతావరణంలో కార్యక్రమం జరిగింది ఈ సన్మానం కార్యక్రమం ద్వారా రాజకీయ నాయకులు, సంస్థ ప్రతినిధులు, పోలీసు శాఖ మధ్య సమన్వయం మరింత బలపడినట్లు కనిపించింది. ఐటీసీ వేదికగా నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.బూర్గంపాడు మండలంలో సేవలందిస్తున్న పోలీసు అధికారికి ప్రజల నుండి లభించిన ఈ గౌరవం, ఆయన పనితీరుకు ప్రతిఫలంగా నిలిచింది.

## సారపాక లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు




- ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం
- ప్రజా మరుగుదొడ్డి ప్రారంభం
- ప్రభుత్వ పాఠశాల నూతన భవనానికి శంకుస్థాపన

**బూర్గంపహాడ్ మహా:** సారపాకలో ఐటిసి సిఎస్ఆర్ నిధుల నుండి నిర్మించిన ప్రజా మరుగుదొడ్డి ను పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు ఉపాయం వెంకటేశ్వర్లు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 7.5 లక్షల రూపాయల వ్యయంతో ప్రజల అభీష్టం మేరకు ఐటిసి నిర్మించింది అన్నారు. అనంతరం గాంధీ నగర్ లో నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసి నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు జహంగీర్ జమీల కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. ఇల్లు నిర్మించుకోవాలనే తమ కలను నెరవేర్చిన నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. పేదోడి సొంతింటి కల నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వం లక్ష్మని అన్నారు. అనంతరం సారపాక పంచాయతీ పరిధిలోని రాజీవ్ నగర్ లో ప్రాథమిక పాఠశాల లో భద్రాచలం ఐటిడిఏ నిధుల ద్వారా సుమారు 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, పంచాయతీరాజ్ శాఖ డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ చక్రధరాచారి, ఐటీసీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి చెంగల్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, పార్టీ జిల్లా మైనార్టీ సెల్ కన్వీనర్ మహిముద్ ఖాన్, స్థానిక సర్పంచ్ శివరాం కిషోర్ నాయక్, ఉప సర్పంచ్ కన్నిదారి రమేష్, వార్డు సభ్యులు ముప్వా వెంకటేశ్వర్లు (లడ్డ), మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి,ఇంగువ రమేష్, పూలపల్లి సుధాకర్ రెడ్డి,భజన ప్రసాద్, చల్లా వెంకటనారాయణ, నియోజకవర్గ యువజన ఉపాధ్యక్షులు ఎడమ కంటి సుధాకర్ రెడ్డి,రహీం ఖాన్, టిఎన్టియుసి అధ్యక్షులు కనకమెడల హరిప్రసాద్, ఐ ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎల్లంకి రాము, దుగ్గెంపూడి శేశిరెడ్డి,తిరుపతి చంటి, వైయస్ఆర్సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు టి.ఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి గాదెరామ కోటిరెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోటా నాగిరెడ్డి, సారెడ్డి అశోక్ రెడ్డి ,కైపు శ్రీనివాసరెడ్డి, క్రాంతి రెడ్డి, జితేందర్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సైదులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు యువజన కాంగ్రెస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి పథకంతో పేదల సొంతింటి కల సాకారం



- త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి
- కూనంనేని కృషితో వేగవంతంగా 3500 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం
- సాంకేతిక లోపాలు సరిదిద్ది వెంటనే బిల్లులు చెల్లించాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా
- గృహప్రవేశ ఉత్సవంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన సాబీర్ పాషా

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** పేదల సొంతింటి కల సాకారం కావడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతోందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని చాతకొండ గ్రామ పంచాయతీ డ్రైవర్స్ కాలనీలోని షేక్ సాహేరా నిర్మించుకున్న ఇందిరమ్మ పథకం గృహప్రవేశ కార్యక్రమంలో సర్పంచ్ వజ్జ ఈశ్వరమ్మ, ఉప సర్పంచ్ మంద గాబ్రియేలులతో కలిసి గురువారం అయన పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగంగా సాగుతోందని త్వరలో రెండో దఫా ఇండ్లు మంజూరుకానున్నాయని తెలిపారు. గృహ నిర్మాణాల్లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి లబ్ధిదారులకు అందాల్సిన బిల్లుల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. పెండింగ్‌లో ఉన్న ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా పేదలను ప్రోత్సహించాలని నిరుపేదల ఆత్మగౌరవ ప్రతీక అయిన ఈ పథకం సజావుగా సాగేలా చూడాలని సూచించారు. శాసనసభ సభ్యులు కూనంనేని సూచనలు సలహాలతో ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా యంత్రాంగం నిరంతరం కృషి చేయాలని ఆయన సూచించారు. గృహప్రవేశ మహోత్సవ కార్యక్రమంలో సర్పంచి వజ్జా ఈశ్వరమ్మ, ఉప సర్పంచ్ మందా గాబ్రియేల్, స్థానిక నాయకులు మల్లు జ్యోతిబసు, మంద నిర్మల, షబానా, సాయి, సోని, సఫీనా, రజియా పాల్గొన్నారు.

## మణుగూరులో ఘనంగా ఉగాది పంచాంగ శ్రవణం



**పాల్గొన్న మణుగూరు డిఎస్పి, భక్తులు..**

**మణుగూరు, మహా :** తెలుగు నూతన సంవత్సరాది ఉగాది సందర్భంగా మణుగూరు అంబేద్కర్ సెంటర్‌లో సనాతన హిందూ ధర్మం ఆధ్వర్యంలో గురువారం ఉచిత పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో సంప్రదాయ పూజలు, భక్తి గీతాలతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమాన్ని విసా వజ్జుల శేషగిరి శర్మ, జొన్నలగడ్డ వెంకటేశ్వరావు, రాపర్తి శ్రీహరి, వత్సవాయి రఘు, ముత్యాల వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ నాగబాబు హాజరై జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం గిరి అయ్యగారు పంచాంగ రాశిఫలాలను వివరిస్తూ పంచాంగాన్ని ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా రామభక్తులు హనుమాన్ చాలీసా, భక్తి గీతాలతో ఆకట్టుకున్నారు. అంబేద్కర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన వేదికపై సరస్వతి దేవిని ప్రతిష్ఠించి, గణపతి పూజలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, సనాతన ధర్మ సభ్యులు పాల్గొని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఉగాది ప్రత్యేక వంటకమైన పచ్చడి, పులిహోర, మజ్జిగ ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సప్తగిరి సూపర్ మార్కెట్, సిరి వాటర్ ప్లాంట్ నరసింహారావు, వైష్ణవి మిల్క్ యజమానులు ప్రసాద దాతలుగా సహకరించారు. టిడిపి సెంటర్ ఆటో స్టాండ్ అసోసియేషన్, పూల, పళ్ల వ్యాపారస్తులు, నగర ప్రముఖులు, ప్రజలు, అధికార యంత్రాంగానికి కార్యక్రమం విజయవంతనికి సహకరించిన ప్రతి ఒక్కరికి నిర్వాహకులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## రంజాన్ ను ఘనంగా నిర్వహించుకోవాలి

### రంజాన్ తోఫా పంపిణీ చేసిన వెంకటరత్నం



**నేలకొండపల్లి, మహా:** రంజాన్ పండుగ ను ప్రతీ ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించుకోవాలని వెలగపూడి వెంకటరత్నం సూచించారు. ప్రతీ ఏటా మాదిరిగానే రంజాన్ సందర్భంగా ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా ను పంపిణీ చేశారు. బుధవారం ముస్లిం పెద్దల సమక్షంలో రంజాన్ తోఫా కిట్ల ను అందించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం పెద్దలు వెంకటరత్నం ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...రంజాన్ మాసం మత సామరస్యానికి ప్రతీక అన్నారు. రంజాన్ పరస్పర గౌరవాన్ని పెంపొందించే పర్వదిమని పేర్కొన్నారు. రంజాన్ పవిత్రత ను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ.వాజీద్, ముస్లిం *పెద్దలు ఎస్.కె.జమాల్, షేక్ సత్తార్, రహిం, మహమ్మద్ జాన్, ఫరీద్, షేక్ సలాం, అజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# "రంజాన్" మాసం ముస్లింలకు పవిత్రమైనది




- జైపూర్ లో పలువురికి ఇఫ్తార్ విందు, తోఫాలు కంపెనీ
- రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేకానంద

**మంచిర్యాల, మహా :** "రంజాన్" మాసం ముస్లింలకు పవిత్రమైనదని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం జైపూర్ మండలం ఇందారం గ్రామ మసీదులో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు, తోఫా పంపిణీ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాబు రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుతో పాటు తోఫా అందిస్తుందని తెలిపారు. జైపూర్ మండలానికి 350 మంజూరు కాగా ఇందారం గ్రామానికి 250 కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో పారిశుధ్యం, త్రాగునీరు, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ ఫైళ్ళ క్లియరెన్స్, ఇతర కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రజాప్రతినిధులకు కార్యక్రమం అమలుపై శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే విధంగా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేసి పలు రకాల వృత్తి విద్యలో శిక్షణ అందించి ఉద్యోగ, వ్యాపార అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు అన్నారు. అనంతరం ఈద్ ఘ తోఫా కార్యక్రమంలో భాగంగా ముస్లిం సోదరులకు కానుకలు అందజేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మసీదు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ షెడ్ ను ప్రారంభించారు.

**క్యాతనపల్లి మునిసిపాలిటీలో**

క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎ జోన్ బిలాల్ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో సైతం మంత్రి జిల్లా కలెక్టర్ లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# విశ్వసనీయతకు గుర్తింపు... అవమానాలు...

**ప్రతిభ కు పట్టం కట్టిన కాంగ్రెస్**
**జిల్లా స్పోక్ పర్సన్ గా నాగరాజు**



**నేలకొండపల్లి, మహా:** పార్టీ అధికారంలో లేకున్నా... అధికార పార్టీ వేధింపులు...తప్పుడు కేసులు...అనేక ఉద్యమాలు...పాలకులు, అధికారుల అవమానాలు... తట్టుకుని పార్టీ బలోపేతం కోసం విశేష కృషి చేసి... గుర్తించిన కాంగ్రెస్ పార్టీ ప్రతిభ కు పట్టం కడుతూ... జిల్లా కమిటిలో గుర్తింపునిచ్చింది. నేలకొండపల్లి మండలం లోని కోరట్లగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు ను కాంగ్రెస్ అధిష్టానం జిల్లా అధికార ప్రతినిధి గా,నియమించింది. గత పదేళ్లలో అప్పటి అధికార పార్టీ ఎన్నో కేసులు బనాయించింది. అక్రమాలను ప్రశ్నించినందుకు వేధింపులకు పాల్పడ్డారు. పార్టీని వీడి... అధికార పార్టీలో చేరాలని ఒత్తిళ్లు చేశారు. అనేక చోట్ల అవమానాలు చేశారు. కానీ కాంగ్రెస్ జెండా ను వదిలేదని హెచ్చరిస్తూ....పార్టీ బలోపేతం కోసం విశేషంగా కృషి చేశారు. అక్రమ కేసులను వ్యతిరేకిస్తూ ఆయన అనుచరులు పోలీస్ స్టేషన్ వద్ద ధర్నాలు నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరం నిరంతరం పార్టీ తరుపున పని చేశారు. పదేళ్లలో అనేక ఇబ్బందులు పడినప్పటికీ కాంగ్రెస్ పార్టీని వీడలేదు... రాజకీయాలలో ఎలాంటి మచ్చ లేకుండా నిస్వార్ధ రాజకీయాలు చేస్తూ పార్టీ అధిష్టానం గుర్తించేలా పని చేశారు.ఈ మేరకు బుధవారం జిల్లా కమిటీలో స్పోక్ పర్సన్ గా నియమించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు మాట్లాడారు....పార్టీ తనపై మరింత బాధ్యత ను పెట్టిందని అన్నారు. జిల్లా'లో పార్టీని బలోపేతం చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు. తన నియామకం కు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. నాగరాజు నియామకం పట్ల కాంగ్రెస్ నాయకులు జెర్రిపోతులు అంజిని, మట్టా దుర్గాప్రసాద్ రెడ్డి, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్, రాయపూడి రోహిత్ తదితరులు హర్షం ప్రకటించారు.

## తిరుమలేశుని సేవలో మున్సిపల్ చైర్ పర్సన్ కుటుంబం



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో సుప్రభాత సేవలో పాల్గొన్నారు. అదిలాబాద్ పట్టణ ప్రజలకు అష్టైశ్వర్యాలు , ఆరోగ్యాలు ప్రసాదించాలని భగవంతున్ని ప్రార్థించినట్టు తెలిపారు.

## విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణి




**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బెల్లంపల్లి పట్టణంలో రామాటాకీస్ చౌరస్తా,రాజీవ్ కాంప్లెక్స్ దగ్గర ఉగాదిపచ్చడి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లిమునిసిపల్ చైర్మన్ దావ స్వాతిరమేష్ బాబు ముఖ్య అతిధిగా హాజరై నారికేల సమర్పణతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా చెర్మన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ, సంతోషాలను కలిగి,అభివృద్ధి సాధించాలని, బెల్లంపల్లి పట్టణం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన పండుగలు మరింత శోభాయమాణంగా ఆనందం ద్విగుణీకృతం అవుతాయని కార్యక్రమం నిర్వాహకులకు అభినందనలు తెలియచేసారు. పర్వదినం సందర్భంగా వారి అమూల్యమైన సమయం కేటాయించి కార్యక్రమం విజయవంతం చేసిన, సేవలో పాలుపంచుకున్న అందరికి పేరుపేరునా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షులు అకెనపల్లి సత్యనారాయణ,ప్రధాన కార్యదర్శి జన్నం సత్యనారాయణ, కోశాధికారి శ్రీరామోజు లక్షణ్ చారీ కృతజ్ఞతలు తెలియచేసారు. కార్య క్రమంలో వార్డు కౌన్సిలర్స్ మేడి పున్నం చంద్రు, బేతి శ్రావణ్, నిచ్చకోళ వంశీ, రాంమూర్తి, నాయకులు నీలికృష్ణ, పోలు శ్రీనివాస్, జలెందర్ సింగ్, బండారి ప్రవీణ్ కుమార్, రేగుంట రాజలింగు తో పాటు విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి



**మందమర్రి, మహా :** అధికార కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం మందమర్రి మార్కెట్ లో పరాభవ నామ సంవత్సరం తెలుగు తొలి ఉగాది పండుగ సందర్భంగా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, బచ్చాలను పలువురికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల డిసిసి అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా వారు పట్టణ ప్రజలకు తెలుగు తొలి ఉగాది పండుగ పరాభవ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు . ఈ నూతన సంవత్సరం ప్రజలందరూ సుఖశాంతులతో అష్టైశ్వర్యాలతో తులతూగాలని భగవంతుని వేడుకున్నట్లు చెప్పారు. పట్టణ ప్రజలు ఉగాది పండుగ లాగానే మిగతా పండుగలు కూడా శాంతియుత వాతావరణం లో ఆనంద ఉత్సాహాల మధ్య జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి పేరం రమేష్, స్థానిక ఎస్సై నరేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# దేవాలయాలలో ఉగాది వేడుకలు



**నేలకొండపల్లి, మహా:** మండలం లోని వివిధ గ్రామాలలో ఉగాది పండుగ సందర్భంగా బుధవారం తెల్లవారు జామునుంచే దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక రామదాసు ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచాగ శ్రవణం కార్యక్రమం ను తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు హజరయ్యారు. ఉగాది పచ్చడి ని అందించారు. ఈ కార్యక్రమంలో పూజారి సౌమిత్రి రమేష్, విద్వత్ కళాపీఠం ప్రతినిధులు పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, రాధాకృష్ణమూర్తి, మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ మహేష్, వార్డు సభ్యులు వంగవీటి పవన్, సామాల కోటేశ్వరరావు, గ్రామ పెద్దలు ఈగ అనిల్కుమార్. కనమర్లపూడి శ్రీధర్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు. మండలం లోని చెరువుమాధారం, రాజేశ్వరపురం, బోదులబండ మంగాపురం తదితర గ్రామాలలో దేవాలయాలలో 'భక్తులతో సందడి నెలకొంది.

## మరణానంతరం నేత్రాలు దానం



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన లింగంపల్లి వర్షిత మరణానంతరం ఆమె కళ్లను దానం చేయడం ద్వారా మరో ఇద్దరికి వెలుగు నింపారు. వర్షిత తల్లిదండ్రులు లింగంపల్లి శ్రీనివాస్,లావణ్య తమ కుమార్తె కళ్లను హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్‌కు దానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్, 6వ వార్డు కౌన్సిలర్ సల్ల కృష్ణవేణిలు పాల్గొని వర్షిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.మహోన్నత నిర్ణయాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని, మరింత మంది కళ్ల దానం చేయడానికి ముందుకు రావాలని ఆకాంక్షించారు.

## ఉగాది జాతీయ పురస్కారానికి రామకృష్ణ ఎంపిక

**మహా :సంగారెడ్డి ప్రతినిధి :** పరాభవ నామ తెలుగు సంవత్సరం ఉగాదిని పురస్కరించుకొని సదాశివపేట మండలంలోని నిజాంపూర్ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా.రామకృష్ణను ఉగాది విశ్వ విఖ్యాత మహోన్నత జాతీయ పురస్కారం 2026కు ఎంపిక చేసినట్లు మనం ఫౌండేషన్ ఫౌండర్ మరియు చైర్మన్ చక్రవర్తి తెలిపారు.ఈ మేరకు రామకృష్ణ కు ఆహ్వానం పంపించారు. ఈ జాతీయ పురస్కారాన్ని రామకృష్ణ ఈ నెలలో హైదరాబాదులోని రవీంద్ర భారతిలో జరిగే సభలో ప్రముఖుల చేతుల మీదుగా అందుకుంటారని అన్నారు.విద్య, సామాజిక సేవా రంగం లో రామకృష్ణ సేవలకు ఈ పురస్కారం అందిస్తున్నట్లు తెలియజేశారు.

## ఎంపీ నిధుల నుండి మంజూరైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



**మహా : సంగారెడ్డి ప్రతినిధి:** సదాశివపేట మండలం లోని గౌ,,మెదక్ పార్లమెంట్ సభ్యులు శ్రీ మాధవనేని రఘునందన్ రావు కృషిద్వారా 5 గ్రామాలకు రూ.50 లక్షల NREGS నిధులు - సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారంసదాశివపేట మండలంలోని 5 గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణానికి NREGS నిధుల ద్వారా రూ. 50 లక్షలు మంజూరు అయ్యాయని మండల అధ్యక్షులు కరణం ఆదిత్య గారు తెలిపారు. మంజూరైన ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఈ రోజు నుంచే ప్రారంభోత్సవం చేశారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా మా సదాశివపేట మండల ప్రజల తరుపున హృదయ ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాంఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లు రవి కుమార్ , లక్ష్మయ్య, ముత్తంగి ఉమారాణి, సవ్వ ఉమాదేవి, అమృతమ్మ , వార్డు మెంబర్లు మరియు బీజేపీ వార్డు మెంబర్లు నామ హరీష్ , మల్లేశం, రవికృష్ణ, రాజు మండల ప్రధాన కార్యదర్శి , ఉక్కిస భరత్, జిల్లా నాయకులు సారా కృష్ణ, సత్యనారాయణ గౌడ్, జగన్నాథ్ రెడ్డి , మండల నాయకులు M.శ్రీకాంత్, శ్రీకాంత్, శ్రీశైలం, సుభాన్, లక్ష్మణ్ , అంబదాస్, సుభాష్, ప్రసాద్, రమేష్, నాగరాజు, కాశీనాథ్, విద్యాసాగర్, ప్రశాంత్, దుర్గరాజ్, అనిల్, కుమార్, శ్రీకాంత్, ఆనంద్ రెడ్డి, గోపాల్ రెడ్డి, వేణు ముత్కనీ, రమేష్, సాకేత్, బన్నీ ,మరియు గ్రామ సర్పంచ్ లు వార్డు మెంబర్లు కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.

### ఆలేరు శ్రీ రంగనాయక ఆలయంలో
## పంచాంగ శ్రవణం



**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు లోని అపర శ్రీరంగంగా పేరొందిన శ్రీ లక్ష్మీ గోదా సమేత రంగనాయక స్వామి వారి ఆలయంలో శ్రీ పరాభవ నామ ఉగాది సందర్భంగా గురువారం సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహించారు... ప్రముఖ వేద పండితులు ఆలేటి రంగన్న పంతులు ఆధ్వర్యంలో జరిగిన ఈ పంచాంగ శ్రవణంలో నూతన తెలుగు సంవత్సరాది లో గోచార ఫలాలను హాజరైన భక్తులకు వివరించారు. శ్రీ పరాభవ నామ సంవత్సరం పేరుతో భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆధ్యాత్మిక చింతనతో కూడిన ఆత్మస్థైర్యంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని తెలిపారు. నూతన సంవత్సరాదిలో ప్రజల జీవితాలు సుఖశాంతులతో సాగుతాయని చెప్పారు. ఆదాయ, ఖర్చు వ్యవహారాల్లో జాగ్రత్తలు అవసరమని సూచించారు. ఆలయ చైర్మన్ మోర్తల గోపిరెడ్డి, ఆలయ అర్చకులు మంగళగిరి శేషగిరి, వరదరాజు, ఆలయ ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## బస్ స్టాండ్ లో చలివేంద్రం ప్రారంభం



**ఆలేరు, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు బస్ స్టాండ్ లో గురువారం హ్యుమానిటీ స్వచ్ఛందా సేవా సంస్థ ఆధ్వర్యంలో మేడిది సుబ్బయ్య ట్రస్టు సహకారంతో చలివేంద్రం ప్రారంభించారు ఎండలు చాలా తీవ్రంగా ఉండడంతో ప్రయాణికులకు నీళ్లు అందించడం చాలా సంతోషమని కాసుల భాస్కర్ అన్నారు ఈ కార్యక్రమంలోబొమ్మకంటి గోపి తదితరులు పాల్గొన్నారు.

## కూల్‌డ్రింక్స్ మానేద్దాం



- సహజ పానీయాలను అలవాటు చేసుకుందాం
- ఈసీఐఎల్ చౌరస్తాలో జెవివి ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ

**కుషాయిగూడ, మహా :** సహజ పానీయాలను అలవాటు చేసుకొని కూల్‌డ్రింక్స్ వినియోగాన్ని తగ్గించాలని కోరుతు జన విజ్ఞాన వేదిక పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక మేడ్చల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఈసీఐఎల్ చౌరస్తాలో ఉగాది పండగ సందర్భంగా "కూల్‌డ్రింక్ మానేద్దాం - సహజ పానీయాలను తాగుదాం" అనే నినాదంతో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన ప్రొఫెసర్ బి.ఎన్.రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ పెద్ది శ్రీనివాస్ గుప్తా, వాసవి క్లబ్ కోశాధికారి తారకేశ్వర్ లు మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే కూల్‌డ్రింక్స్ ఆరోగ్యానికి హానికరమని, వీటి వినియోగం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. మన పూర్వీకులు అనుసరించిన సహజ పానీయాలు శరీరానికి శక్తిని, ఆరోగ్యాన్ని అందిస్తాయని తెలిపారు. ఉగాది పచ్చడి వంటి సంప్రదాయ ఆహారాలు జీవన విధానంలో భాగమని, ఇవి మన సంస్కృతి, ఆరోగ్య పరిరక్షణకు ప్రతీకలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్, కోశాధికారి పి.నాగరాజులు మాట్లాడుతూ.. రసాయనాలతో తయారయ్యే కూల్‌డ్రింక్స్ శరీరానికి మేలు చేయవని, వీటి బదులు నిమ్మరసం, పానకం, రాగిజావా, కొబ్బరినీళ్లు, మజ్జిగ వంటి సహజ పానీయాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. పండుగల సందర్భాల్లో సంప్రదాయ ఆహారాల ప్రాముఖ్యతను గుర్తించి, ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. అధిక చక్కెరలు, రసాయనాలు కలిగిన కూల్‌డ్రింక్స్ వినియోగం వల్ల ముఖ్యంగా పిల్లలు, యువత ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. వేసవి కాలంలో సహజ పానీయాలే ఉత్తమమని, ఇంటి వద్దే తయారు చేసుకునే పానకం, నిమ్మరసం, బెల్లం నీరు వంటి సహజ పానీయాలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఉన్నత అధికారులు మాట్లాడుతూ.. ఆరోగ్యం కోసం సహజ పానీయాలను ప్రోత్సహిస్తున్న జన విజ్ఞాన వేదికను అభినందించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా కోశాధికారి జెన్నీ నాయకులు సోమయ్యచారి శేషు, నాగేశ్వరరావు, నరసింహారావు, వెంకయ్య, వెంకట్, అశోక్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

### కృత్రిమ పానీయాలు వద్దు..
## సహజ పానీయాలే ముద్దు..

**ఆరోగ్యాన్ని కాపాడుకుందాం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్..**
**గడియారం సెంటర్ వద్ద ఘనంగా ఉగాది పచ్చడి వితరణ..**
**టీఎస్ యూటీఎఫ్, జన విజ్ఞాన వేదికల వినూత్న ప్రచారం..**



**నల్లగొండ, మహా :** ప్రకృతి ప్రసాదించిన సహజ పానీయాలతోనే ఆరోగ్యం సిద్ధిస్తుంది.. కృత్రిమ పానీయాల జోలికి వెళ్లి ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దు అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శ్రీ పరాభావ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్ వద్ద తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (TSUTF), జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నన్నూరి రమణారెడ్డి, నర్రా శేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి పచ్చడి పంపిణీని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో పెరుగుతున్న కృత్రిమ పానీయాల వినియోగంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు టీఎస్ యూటీఎఫ్ చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. మున్సిపల్ మేయర్ శ్రీమతి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మన శరీరానికి అవసరమైన పోషకాలు అందించే సహజ సిద్ధమైన పానీయాలనే సేవించాలని కోరారు.రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం, ఉపాధ్యక్షులు ఎం. రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. యువత శీతల పానీయాలకు బానిసై ఆరోగ్యాన్ని క్షీణింపజేసుకుంటున్నారని, వారికి అవగాహన కల్పించేందుకే ఏటా ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. డీఎస్పీ గారు మాట్లాడుతూ.. వేసవి కాలంలో కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం, చెరుకు రసం వంటి ప్రకృతి సిద్ధ పానీయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**భవిష్యత్ దర్శనం 'పంచాంగ పఠనం'**

మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తెలుగు నూతన సంవత్సరం రాశులు, నక్షత్ర ఫలాలను తెలుసుకునే గొప్ప పండుగని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎడ్ల సైదులు, జిల్లా కార్యదర్శులు గేర నరసింహ, మురలయ్య, నలపరాజు వెంకన్న, కొమ్రరాజు సైదులు, మధుసూదన్, జన విజ్ఞాన వేదిక బాధ్యులు చంద్రశేఖర్, పిడి విమల, టాప్రా జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్, అడ్వకేట్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## తల్లి బిడ్డను బంధువులకు అప్పగించిన 'సఖీ'




**ఆలేరు, మహా:** ఆలేరు రైల్వే స్టేషన్ ఆవరణలో గత నెల రోజులుగా వుంటున్న వితంతు మహిళ గూడ సుజాత (50) కూతురు (19) సఖీ చొరవతీసుకొని వారికి కౌన్సిలింగ్ ఇచ్చి వారి బంధువుల ఇంటికి చేర్చారు.. అయితే నెల రోజులుగా రైల్వే స్టేషన్ ఆవరణలో తల్లి కూతురు వుంటుంది...ఈ విషయంపై సఖీ సెంటర్ కు ఫోన్ చేయడంతో వెంటనే స్పందించిన అంగన్ వాడి టీచర్లు అక్కడికి చేరుకొని వారి వివరాలు సేకరించి తల్లి కూతురుకు కౌన్సిలింగ్ ఇచ్చి వారి బంధువులను పిలిపించి సఖీ వ్యాన్ లో ఇంటి వద్ద క్షేమంగా వదిలిపెట్టారుసఖీ ,ఐసిడిఎస్ అధికారులు ,ఐసిడిఎస్ ,అంగన్ వాడీ టీచర్లు అనురాధ,సరిత,సావిత్రి,ఫాతిమాలు స్పందించిన తీరును ప్రజలు అభినందించారు..

### శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో
## పంచాంగ శ్రవణం



**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో గురువారం సాయంత్రం శ్రీ పరాభవ నామ ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం నిర్వహించారు వేద పండితులు వేదాటి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో నూతన తెలుగు సంవత్సర గోచార ఫలితాలను భక్తులకు వివరించారు. పట్టణానికి చెందిన వ్యాపార ప్రముఖులు, ఆధ్యాత్మికవేత్తలు, ప్రజా ప్రతినిధులు, భక్తులు పంచాంగ శ్రవణానికి హాజరయ్యారు.




### పేదల సొంతింటి కల సాకారం
## ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాల పండుగ..!

- ఉగాది వేళ నూతన గృహాల్లోకి లబ్ధిదారులు..
- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ బి.చంద్రశేఖర్ చేతుల మీదుగా ప్రారంభం..
- జిల్లాలో 6,409 ఇళ్లే లక్ష్యం కలెక్టర్..





**చిట్యాల, మహా :** పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం జిల్లాలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది. గురువారం నకిరేకల్ నియోజకవర్గం చిట్యాల మండలం గుండ్రంపల్లి, పెదకాపర్తి గ్రామాల్లో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ లబ్ధిదారులతో కలిసి నూతన గృహప్రవేశాలు చేయించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేదవాడికి సొంత గూడు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో జిల్లా వ్యాప్తంగా 6,409 ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఉగాది పర్వదినం నుంచి వచ్చే మూడు రోజుల్లోనే జిల్లాలో 2,281 గృహప్రవేశాలు పూర్తి చేస్తామని, ఒక్క నకిరేకల్ నియోజకవర్గంలోనే 348 ఇళ్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో పేదల సొంతింటి కల సాకారమవుతోందని కలెక్టర్ పేర్కొన్నారు.

**రెండో విడతలో మరిన్ని ఇళ్లు.. ఎమ్మెల్యే**

ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పేదలకు గృహవసతి కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటికే 300 పైగా ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం 4 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని, త్వరలోనే రెండో విడత ద్వారా మిగిలిన అర్హులందరికీ ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా త్వరలోనే అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. సొంత ఇంటి కల నెరవేరడంతో లబ్ధిదారులు ఆనందోత్సాహాల మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యేకు, కలెక్టర్‌కు కృజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, హౌసింగ్ పీడీ రాజ్ కుమార్, చిట్యాల మున్సిపల్ చైర్మన్ పందిరి గీత, తహసీల్దార్ విజయ, ఎంపీడీవో జయలక్ష్మి, ఏఈ ప్రీతి, సర్పంచ్ కాటం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు

# క్రూడ్ బాంబ్.. మార్కెట్ క్రాష్




**ముంబై:** అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు భగ్గుమనడంతో దలాల్ స్ట్రీట్‌లో అన్ని రంగాల షేర్లు దగ్ధమయ్యాయి. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా చమురు, గ్యాస్ క్షేత్రాలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్ గురువారం పేకమేడలా కూలిపోయింది. క్రూడాయిల్ ధరలు మళ్లీ తారస్థాయికి చేరుకోవడం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాత్కాలిక చైర్మన్ అతాను చక్రవర్తి రాజీనామా, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు కొనసాగడం తదితర అంశాలతో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఫలితంగా సెన్సెక్స్ ఏకంగా 2,497 పాయింట్లు(3.26%) క్షీణించి 74,207 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 776 పాయింట్లు కుప్పకూలి 23,002 వద్ద నిలిచింది. 2024 జూన్ 24 తర్వాత ఇరు సూచీలకిదే అత్యంత భారీ పతనం కావడం గమనార్హం. స్టాక్ మార్కెట్ మూడు శాతానికిపైగా పతనంతో ఒక్కరోజే రూ.12.87 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద హరించుకుపోయింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.426 లక్షల కోట్లకు దిగివచ్చింది. ఆసియా మార్కెట్లు 3%, యూరప్ మార్కెట్లు 2.50% పతనమయ్యాయి. అమెరికా స్టాక్ సూచీలు ఒకశాతం నష్టంతో ట్రేడవుతున్నాయి.

**అమ్మకాల సునామీ:**

అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూలతలతో సూచీలు ఉదయమే భారీ నష్టాలతో మొదలయ్యాయి. అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో ఒక దశలో సెన్సెక్స్ 2,753 పాయింట్లు క్షీణించి 73 వేల స్థాయి దిగువన 73,951 వద్ద, నిఫ్టీ 848 పాయింట్లు పతనమై 22,930 వద్ద ఇంట్రాడే కనిష్టాలు నమోదు చేశాయి.

- బీఎస్ఈ ఇండెక్సుల్లో ఆటో 4.07%, రియల్టీ 3.79%, ఫైనాన్సియల్ సర్వీసెస్ 3.66% పతనమయ్యాయి. మిడ్, స్మాల్ క్యాప్‌లు వరుసగా 3.34%, 2.77% పడ్డాయి. సెన్సెక్స్‌లో 30 షేర్లూ నష్టాలతో ముగిశాయి. ఎటర్నల్(5.6%), బజాజ్ ఫైనాన్స్(5.4%), ఎంఅండ్ఎం(5.2%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(5.1%), ఎల్అండ్‌టీ (4.7%) అత్యధికంగా నష్టపోయాయి.

### పతనానికి 'పంచ' కారణాలు

- భగ్గుమన్న చమురు ధరలు: ఇరాన్ దాడులు తీవ్రం చేయడంతో గల్ఫ్ దేశాల్లో చమురు ఉత్పత్తి, సరఫరా వ్యవస్థ పూర్తి గా స్తంభించిపోయింది. దీంతో బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధర మళ్లీ 119 డాలర్ల స్థాయికి తాకింది. ఇది భారతీయ ఆర్థిక వ్యవస్థపై నేరుగా ప్రభావం చూపుతుందనే ఆందోళనలతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపారు.
- విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు: యుద్ధ భయాలు ప్రపంచవ్యాప్తంగా వ్యాపించడంతో విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. ఈ వారంలో కేవలం నాలుగు ట్రేడింగ్ సెషన్లలో మొత్తం రూ.24 వేల కోట్ల విలువైన దేశీయ ఈక్విటీలు విక్రయించారు. గురువారం ఒక్క రోజే రూ.7,558 కోట్లు అమ్మకాలకు పాల్పడ్డారు. గడిచిన 14 రోజులుగా ఎఫ్ఐఐలు నికర అమ్మకందారులుగా నిలుస్తున్నారు.
- **ఫెడ్ వడ్డీరేట్లు యథాతథం:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు పెరుగుతున్న ద్రవ్యోల్బణం అంశాలను కారణాలుగా చూపుతూ అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా కొనసాగించింది. రానున్న కాలంలో వడ్డీ రేట్ల పెంపు సంకేతాలతో ప్రపంచ వ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లలో ఇన్వెస్టర్లు అమ్మకాలకు తెగబడ్డారు.
- **హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేర్ల అమ్మకాలు:** ప్రైవేటు బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాత్కాలిక చైర్మన్ అతాను చక్రవర్తి రాజీనామాతో బ్యాంకు షేరు ఇంట్రాడేలో బ్యాంక్ షేర్లు 8.7 శాతం మేర పతనమయ్యాయి. అధిక వెయిటేజీ కలిగిన స్టాక్ కావడంతో సూచీలపై ఆ ప్రభావం కనిపించింది.
- **లాభాల స్వీకరణ:** పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతలు కొనసాగుతున్నా... దేశీ సూచీలు గత మూడు ట్రేడింగ్ సెషన్లలో ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ మొత్తం 2,140 పాయింట్లు(2.87%) ఎగసింది. క్రూడాయిల్ ధరలు మళ్లీ పెరగడం, అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలో ప్రతికూల సంకేతాల ప్రభావంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు.

# చమురు భగభగ..

## బ్రెంట్ బ్యారల్ 119 డాలర్లు

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా యుద్ధంలో భాగంగా గల్ఫ్ ఇంధన క్షేత్రాలు, నిల్వలపై దాడులకు తెరతీయడంతో ముడిచమురు ధరలు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. లండన్ మార్కెట్లో బ్రెంట్ చమురు బ్యారల్ 9 శాతం జంప్‌చేసి 117 డాలర్లకు చేరింది. దేశీయంగా ఎంసీఎక్స్‌లో ఏప్రిల్ డెలివరీ కాంట్రాక్ట్ రూ. 74 పెరిగి రూ. 9,067ను తాకింది. యూఎస్ నైమెక్స్‌లోనూ లైట్ స్వీట్ చమురు పీపా 1.6 శాతం బలపడి 97 డాలర్లకు చేరింది. హోర్ముజ్ మూసివేతకుతోడు.. ఖతార్‌లోని గ్యాస్ సౌకర్యాలు, కువైట్‌లోని చమురు రిఫైనరీలు దాడులకు గురికావడం తదితర అంశాలు ఇంధన సరఫరాలను దెబ్బతీయనున్న ఆందోళనలు ధరలను ఎగదోస్తున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. దీంతో భారత్ చమురు బాస్కెట్ 145 డాలర్లను అధిగమించనున్నట్లు వెలువడిన అంచనాలు దేశీయంగా ఇంధన రంగ దిగ్గజ షేర్లలో భారీ అమ్మకాలకు దారి చూపాయి.

# రూ.2,929 కోట్ల బ్యాంకు మోసం.. సీబీఐ ఎదుట అనిల్ అంబానీ



రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్) నిధుల మళ్లింపు కేసులో రిలయన్స్ గ్రూప్ అధినేత అనిల్ అంబానీ గురువారం సీబీఐ ఎదుట హాజరయ్యారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిర్యాదు మేరకు నమోదైన బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) ఆయన్ని సుదీర్ఘంగా ప్రశ్నించింది.

### నిధుల మళ్లింపుపైనే ప్రధాన దృష్టి

తెల్లవారుజామునే ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న అనిల్ అంబానీని ఆర్‌కామ్‌కు కేటాయించిన రుణాల వినియోగంపై అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. కంపెనీ అవసరాల కోసం తీసుకున్న రుణాలను ఇతర అవసరాలకు మళ్లించడం, నిధుల దుర్వినియోగం, నిబంధనలకు విరుద్ధంగా ఆర్థిక లావాదేవీలు జరిపారనే ఆరోపణలున్నాయి. ఎస్‌బీఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత ఏడాది ఆగస్టులో అనిల్ అంబానీపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదైంది. అనిల్ అంబానీ ప్రతినిధి వెల్లడించిన వివరాల ప్రకారం.. మార్చి 19, 20 తేదీల్లో ఆయన దర్యాప్తు సంస్థ ముందు విచారణకు హాజరు అవుతున్నారు.

### ముగిసిన 'జై అన్మోల్' విచారణ

ఇదే క్రమంలో అనిల్ అంబానీ కుమారుడు జై అన్మోల్ అంబానీని కూడా సీబీఐ వదిలిపెట్టలేదు. రిలయన్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్ఎఫ్ఎల్)లో జరిగిన రూ.228.06 కోట్ల ఆర్థిక అవకతవకలపై గత వారం (మార్చి 14, 2026) ఆయన్ను అధికారులు విచారించారు. 'చట్టబద్ధమైన దర్యాప్తు సంస్థలకు పూర్తి స్థాయిలో సహకరించేందుకు అనిల్ అంబానీ కట్టుబడి ఉన్నారు. అందులో భాగంగానే ఈ విచారణకు హాజరవుతున్నారు' అని అనిల్ అంబానీ అధికార ప్రతినిధి చెప్పారు. ఈ కేసులో మరికొంతమంది ప్రభుత్వ అధికారులు, రిలయన్స్ గ్రూప్ మాజీ ఉన్నతాధికారుల పాత్రపై కూడా సీబీఐ ఆరా తీస్తోంది. ఇప్పటికే జై అన్మోల్ నివాసాల్లో సోదాలు నిర్వహించిన అధికారులు, తాము సేకరించిన డాక్యుమెంట్ల ఆధారంగా విచారణను వేగవంతం చేశారు.

# టాటా వాణిజ్య వాహనాల ధరల పెంపు

**న్యూఢిల్లీ:** ప్రముఖ వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ తన వాణిజ్య వాహనాల ధరలను పెంచేందుకు సిద్ధమైంది. ఈ ఏప్రిల్ 1 నుంచి అన్ని కమర్షియల్ వాహనాలపై 1.50 శాతం వరకు ధరలు పెంచుతున్నట్టు ప్రకటించింది. మోడల్, వేరియంట్‌ను బట్టి పెంపు పరిధి మారుతుందని పేర్కొంది. ముడి సరుకుల ధరలు, ఇతర ఇన్‌పుట్ ఖర్చులు పెరగడంతో వాటి ప్రభావాన్ని కొంత మేర తగ్గించుకునేందుకు ఈ ధరల పెంపు చేపడుతున్నట్టు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. 180 బిలియన్ డాలర్ల టాటా గ్రూప్‌లో భాగమైన టాటా మోటార్స్, దేశంలో యుటిలిటీ వాహనాలు, పికప్ వాహనాలు, ట్రక్కులు, బస్సుల తయారీలో అతిపెద్ద సంస్థగా ఉంది.




# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# ఇరాన్ మిస్సైల్ ప్లాంట్‌ను నేలమట్టం చేసిన అమెరికా

ఇరాన్‌లోని కరాజ్ నగరంలో ఉన్న సర్ఫేస్‌టుసర్ఫేస్ క్షిపణి తయారీ కేంద్రాన్ని అమెరికా దళాలు పూర్తిగా ధ్వంసం చేసినట్లు ఆ దేశ సెంట్రల్ కమాండ్ (CENTCOM) ప్రకటించింది. ఈ కేంద్రం బాలిస్టిక్ క్షిపణులు అసెంబుల్ చేయడానికి ఉపయోగించబడేదని.. అమెరికన్లు, పొరుగు దేశాల వాణిజ్య నౌకాయానానికి ముప్పు కలిగిస్తుండిందని CENTCOM పేర్కొంది. అమెరికా వైమానిక దళం నిర్వహించిన ఈ దాడిలో కరాజ్ ప్లాంట్ పూర్తిగా నేలమట్టమైంది. CENTCOM విడుదల చేసిన ఏరియల్ ఫోటోలు ఆ సదుపాయం పూర్తిగా ధ్వంసమైందని చూపిస్తున్నాయి. ఈ ప్లాంట్ ఇరాన్ క్షిపణి సామర్థ్యానికి కీలకమైన కేంద్రంగా ఉండింది. కరాజ్ ప్లాంట్ పూర్తిగా నిరుపయోగం కావడం వల్ల ఇరాన్ సైనిక సామర్థ్యం మరింత బలహీనపడే అవకాశం ఉంది. అలాగే గల్ఫ్ ప్రాంతంలో వాణిజ్య నౌకాయానానికి కూడా ముప్పు తగ్గుతుంది. ఇదిలా ఉంటే, ఇజ్రాయెల్‌అమెరికా ఎన్ని దెబ్బలు కొట్టినా ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడులు కొనసాగిస్తూనే ఉంది. అమెరికా హెచ్చరికలు బేఖాతరు చేస్తూ గల్ఫ్ దేశాల ఇంధన సముదాయాలపై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడుతుంది. సౌత్ పార్స్ గ్యాస్ ఫీల్డ్‌పై దాడులకు ప్రతిగా ఇరాన్ ఖతర్‌లోని ఎల్ఎన్‌జీ ప్లాంట్ పై క్షిపణులు ప్రయోగించింది. ఈ దాడిలో ఎల్ఎన్‌జీ ప్లాంట్ భారీగా దెబ్బతింది. ఈ దాడులు ఇంధన ధరలను పెంచి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. ఇప్పటికే హర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఆధిపత్యం కొనసాగుతుండటంతో ప్రపంచ చమురు సరఫరాలో ఐదో వంతు ప్రభావితమవుతోంది.

# శాంతిదూత డొనాల్డ్ ట్రంప్!


## జపాన్ ప్రధాని తకాయిచి ప్రశంస



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై జపాన్ మహిళా ప్రధాని సనే తకాయిచి ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచంలో శాంతిని నెలకొల్పే సామర్థ్యం ఆయనకు ఉందని చెప్పారు. ట్రంప్‌ను శాంతిదూతగా అభివర్ణించారు. హోర్ముజ్ జలసంధిలో చమురు నౌకల రక్షణకు యుద్ధ నౌకలను పంపించడానికి జపాన్ ముందుకు రాలేదంటూ రుసరుసలాడుతున్న ట్రంప్ ఆగ్రహాన్ని చల్లార్చేందుకు ప్రయత్నించారు. అమెరికా అధ్యక్షుడితో సంబంధాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామంటూ సంకేతాలిచ్చారు. తకాయిచి గురువారం వైట్‌హౌస్‌లో డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు. పశ్చిమాసియా యుద్ధంపై వారు చర్చించుకున్నట్లు సమాచారం. ఇరాన్ అణ్వస్త్ర కార్యక్రమాలు చేపట్టడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తకాయిచి స్పష్టంచేశారు. తకాయిచి నాయకత్వాన్ని ట్రంప్ కొనియాడారు. ఆమె బహుళ ప్రజాదరణ కలిగిన శక్తివంతురాలైన నేత అంటూ ప్రశంసించారు. ఇరాన్‌పై యుద్ధంలో అమెరికాకు జపాన్ అందించే సాయంపై వారు మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది. ఈ యుద్ధంలో జపాన్ సహకారాన్ని ట్రంప్ కోరుతున్నారు. షెడ్యూల్ ప్రకారం డొనాల్డ్ ట్రంప్ త్వరలో చైనాలో పర్యటించబోతున్నారు. ఈ పర్యటనకు ముందుకు ఆయన జపాన్ ప్రధానమంత్రితో సమావేశం కావడం చర్చనీయాంశంగా మారింది.

# సోషల్ మీడియాతో సంతోషం ఆవిరి!

**హెల్సింకీ:** ఆధునిక కాలంలో అందుబాటులోకి వచ్చిన సోషల్ మీడియా యువతలో సంతోషాన్ని ఆవిరి చేస్తోంది. లేనిపోని ఆందోళనకు కారణమవుతోంది. ప్రధానంగా పశ్చిమ దేశాల్లో ఈ పరిస్థితి అధికంగా కనిపిస్తోంది. యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన వెల్‌బీయింగ్ రీసెర్చ్ సెంటర్ గురువారం విడుదల చేసిన 'వరల్డ్ హ్యాపినెస్ రిపోర్ట్-2026'ఇదే విషయం వెల్లడించింది. గ్యాలప్ విశ్లేషణ సంస్థ, ఐక్యరాజ్యసమితి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్ నెట్‌వర్క్ భాగస్వామ్యంతో ఈ నివేదిక రూపొందించారు. అధ్యయనంలో భాగంగా 147 దేశాల్లో లక్షల మందిని ప్రశ్నించారు. వారి అభిప్రాయాలు సేకరించారు. ప్రపంచంలో ఫిన్‌లాండ్ అత్యంత సంతోషంగా ఉన్న దేశమని నివేదిక పేర్కొంది. ఈ జాబితాలో ఫిన్‌లాండ్ వరుసగా తొమ్మిదోసారి అగ్రస్థానం దక్కించుకోవడం విశేషం. ఈసారి టాప్-10 జాబితాలో ఫిన్‌లాండ్‌తో పాటు ఐస్‌లాండ్, డెన్మార్క్, స్వీడన్, నార్వే తదితర దేశాలకు స్థానం దక్కింది. అగ్రరాజ్యం అమెరికాకు 23, కెనడాకు 25, బ్రిటన్‌కు 29వ ర్యాంకు లభించింది. భారత్‌కు 116వ ర్యాంకు దక్కింది. నివేదికలోని కీలక అంశాలివీ..




- కోస్టారికా దేశం 2023లో 23వ స్థానంలో ఉండగా, 2026లో నాలుగో ర్యాంకు దక్కించుకుంది.
- ఏమాత్రం సంతోషంగా లేని దేశాల్లో అఫ్ఘానిస్తాన్, సియెర్రాలియోన్, మలావీ నిలిచాయి.
- అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల్లో 25 ఏళ్లలోపు యువత సోషల్ మీడియాకు బానిసగా మారుతోంది. ఫలితంగా వారు వాస్తవ ప్రపంచానికి దూరంగా జీవిస్తున్నారు. సంతోషానికి దూరమవుతున్నారు.
- మనుషులు సంతోషంగా ఉండాలంటే కుటుంబ బంధాలకు విలువ ఇవ్వడం చాలా ముఖ్యం. సామాజికంగా ఇతరులతో స్నేహ సంబంధాలు మెరుగుపర్చుకోవాలి.
- సామాజిక జీవితాల్లో నాణ్యత, స్థిరత్వం ఉన్న దేశాల్లో ప్రజలు సంతోషంగా ఉంటున్నట్లు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జాన్ ఎమ్మానుయేల్ డీనెవ్ చెప్పారు. లాటిన్ అమెరికా దేశాల్లో కుటుంబ బంధాలు, సామాజిక సంబంధాలు బలంగా ఉంటాయని వెల్లడించారు. అందుకే అక్కడి ప్రజలు సంతోషంగా జీవిస్తున్నట్లు స్పష్టంచేశారు.
- ఫిన్‌లాండ్‌తోపాటు ఉత్తర యూరోపియన్ దేశాలు సంతోషంగా ఉండడానికి కారణం ఏమిటన్నది పరిశీలిస్తే.. అక్కడి సంపద, ఆ సంపద పంపిణీలో సమానత్వం,
- ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసే ప్రభుత్వాలు ఉండడం, ఆర్థిక విపత్తుల నుంచి ప్రజలను కాపాడేందుకు చర్యలు చేపట్టడం, ఆరోగ్యకరమైన జీవన శైలి, ప్రజల ఆయుర్దాయం ఎక్కువగా ఉండడం వంటివి కనిపిస్తాయి.

# వీధిలో పాన్ ఉమ్మినందుకు రూ.3.5 లక్షల జరిమానా

## ఇద్దరు భారతీయులకు శిక్ష విధించిన లండన్ అధికారులు

**లండన్:** బహిరంగ ప్రాంతాల్లో పాన్ ఉమ్మినందుకు లండన్‌లో ఇద్దరు భారతీయులకు దాదాపు రూ.3.48 లక్షల(2,800 డాలర్ల) జరిమానా విధించారు. మొదట విధించిన 100 పౌండ్ల జరిమానాను చెల్లించకపోవడం, కోర్టుకు గైర్హాజరవడంతో ఆగ్రహించిన బ్రెంట్ సిటీ అధికారులు పెద్ద మొత్తంలో జరిమానా విధించారు. లండన్ శివార్లలో ఉన్న ప్రాంతం బ్రెంట్. ఇది లండన్‌లోని అత్యంత చైతన్యవంతమైన ప్రాంతం. పాన్ ఉమ్మడం వల్ల నగరం రోడ్లు పాడవుతున్నాయి. ఈ మరకలను శుభ్రపరచడానికి నగర కౌన్సిల్‌కు భారమైంది. పాన్ మరకలను శుభ్రపరచడానికి కౌన్సిల్ ఏడాదికి 30,000 పౌండ్లు ఖర్చు చేస్తోంది. ఇది పౌరులపై పన్ను భారం మోపుతుండటంతో నగర కౌన్సిల్ దీనికి వ్యతిరేకంగా జీరో-టాలరెన్స్ ప్రచారాన్ని ప్రారంభించింది. అయితే ఎడ్జ్‌వేర్ పట్టణ నివాసి అయిన అక్షిత్ భద్రే పటేల్ 2025 జూన్‌లో స్థానిక మెట్రో స్టేషన్ సమీపంలోని కింగ్స్‌బరీ రోడ్డుపై పాన్ ఉమ్మినందుకు నార్త్ వెస్ట్ లండన్ మేజిస్ట్రేట్స్ కోర్టు జరిమానా విధించింది. పటేల్ కోర్టు విచారణకు హాజరు కాలేదు. తనకు విధించిన జరిమానా 100 పౌండ్లు చెల్లించలేదు. రూయిస్లిప్ శివారు ప్రాంత నివాసి అయిన హితేష్ పటేల్ వెంబ్లీ హిల్ రోడ్డుపై పాన్ ఉమ్మినందుకు జరిమానా విధించింది. మొదటి కేసు తరహాలోనే ఈయనా కోర్టుకు హాజరుకాలేదు. జరిమానా చెల్లించలేదు. దీంతో జరిమానా పది రెట్లు పెరిగింది. లండన్‌లోని బ్రెంట్, దాని పొరుగునే ఉన్న హారోతో సహా పలు ప్రాంతాల్లో పాన్ ఉమ్మివేయడంపై ఆందోళనల నేపథ్యంలో కౌన్సిల్ ఈ కఠిన చర్యలు చేపట్టింది. 'మా వీధులను పాడుచేసే వారిని మేం అస్సలు సహించబోం. మేం విధించే ప్రతి జరిమానా ఒక స్పష్టమైన సందేశం. మీరు మా వీధులను పాడు చేస్తే మేం మిమ్మల్ని పట్టుకుంటాం. దానికి మీరు మూల్యం చెల్లించాల్సిందే' అని కౌన్సిలర్ కృపా షెత్ అన్నారు.





# అయోధ్య ఆలయంలో శ్రీరామ యంత్రాన్ని ప్రతిష్ఠించిన రాష్ట్రపతి ముర్ము

**అయోధ్య/మధుర:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం అయోధ్య భవ్య రామ మందిరంలో బాలరాముడిని దర్శించుకున్నారు. 'శ్రీరామ యంత్ర'ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. బంగారు పూత కలిగిన 150 కిలోల చదరపు లోహపు యంత్రాన్ని ఆలయంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ముర్ము ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరి సంతోషం, సౌభాగ్యం కోసం రాష్ట్రపతి ముర్ము ప్రార్థించారని రాష్ట్రపతి భవన్ 'ఎక్స్'లో పోస్టు చేసింది. 'శ్రీరామ యంత్ర'కు విశేషమైన ప్రాధాన్యం ఉందని ఆలయ ట్రస్టు సభ్యుడు అనిల్ మిశ్రా చెప్పారు. స్వామి విజయేంద్ర సరస్వతి మార్గదర్శకత్వంలో యంత్రాన్ని రూపొందించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రెండేళ్ల క్రితమే అయోధ్యకు తెప్పించారు. అప్పటి నుంచి నిత్యం పూజలు చేస్తున్నారు. అభిజిత్ ముహూర్తం, చైత్ర నవరాత్రి కావడంతో గురువారం శాస్త్రోక్తంగా ఆలయం రెండో అంతస్తులో ప్రతిష్ఠించారు. ముర్ము మధురలో పలు ఆలయాలను సైతం దర్శించుకున్నారు. వివిధ కార్యక్రమాలకు హాజరయ్యారు. బృందావన్‌లోని ఇస్కాన్ ఆలయంలో దర్శనం చేసుకొని, ఆరతి కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామి ప్రభుపాద సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం గౌర్ నితాయ్, బలరామ్, శ్యామ్‌సుందర్ ఆలయంలో పూజలు చేశారు.






## నా అనుమతి లేకుండానే
# ఆ పని చేశారు

గత కొన్నిరోజులుగా 'సర్కే చునారియా' అనే పాట ఎంతలా వివాదాస్పదమైందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. బూతు సాహిత్యం మరీ దారుణంగా ఉండేసరికి కేంద్రం కూడా దీనిపై రియాక్ట్ అయింది. దీంతో పాటని యూట్యూబ్ నుంచి తొలగించారు. సింగర్ మంగ్లీ కూడా క్షమాపణలు చెప్పింది. ఈ గీతంలో డ్యాన్స్ చేసిన నోరా ఫతేహి ఇప్పుడీ వివాదంపై మాట్లాడింది. తన అనుమతి లేకుండానే ఇదంతా చేశారని చెప్పకొచ్చింది. ఈ మేరకు ఓ వీడియో రిలీజ్ చేసింది. 'ఈ పాటని మూడేళ్ల క్రితం కన్నడలో షూటింగ్ చేశారు. తర్వాత ఎలా మార్చారో నాకు తెలియదు. ఓ పెద్ద మూవీ కావడం, సంజయ్ దత్ లాంటి స్టార్ ఉండేసరికి ప్రాజెక్ట్ ఒప్పకొన్నాను. నిజానికి ఇది 'నాయక్ నహీ ఖల్నాయక్ హో మెయిన్' పాట రీమేక్ అనుకున్నాను. కన్నడ లిరిక్స్ అర్థం కాకపోవడం వల్ల వాళ్లు చెప్పిందే నమ్మాను. అందులో ఏం అసభ్యత అనిపించలేదు. కానీ హిందీలో డబ్ చేయడానికి నా దగ్గర ఎలాంటి అనుమతి తీసుకోలేదు. అసలు ఇది నా దృష్టికే రాలేదు''పాట లాంచ్ ఈవెంట్‌లోనూ నాకు ఇబ్బందికర అనుభవాలు ఎదురయ్యాయి. లిరికల్ వీడియోలో ఏ మాత్రం బాగోలేని ఫొటోలు, నాతో పాటు సంజయ్ దత్‌కి సంబంధించిన ఏఐ ఫొటోని ఉపయోగించేసరికి చాలా చిరాకేసింది. అయినా నిగ్రహంగా ఉన్నాను. హిందీ వెర్షన్ చూసిన తర్వాత ఇది కచ్చితంగా విమర్శల పాలవుతుందని ఊహించాను. ఈ విషయం దర్శకుడికి చెప్పి ప్రాజెక్ట్ నుంచి తప్పకొన్నాను. ప్రజల విమర్శల కారణంగానే మేకర్స్ పాట తొలగించారు. ఇందుకు కృతజ్ఞతలు. ఇకపై నేను మరింత జాగ్రత్తగా ఉంటాను' అని నోరా ఫతేహి చెప్పకొచ్చింది. కన్నడ హీరో ధ్రువ్ సర్జా హీరోగా నటించిన 'కేడీ' మూవీలోనిది ఈ పాట. దాదాపు మూడేళ్లకు పైగా సెట్స్‌లో ఉన్న ఈ చిత్రానికి ప్రేమ్ దర్శకుడు. సంజయ్ దత్, శిల్పా శెట్టి లాంటి బాలీవుడ్ స్టార్స్ ఇందులో నటించారు. రీసెంట్‌గా మొదటి పాటగా దీన్ని రిలీజ్ చేస్తే ఇంతలా వివాదాస్పదమైంది.

## సాలిడ్ హిట్ కోసం ఎదురుచూస్తున్న
# యంగ్ బ్యూటీ ఈషా రెబ్బా..

తెలుగు ప్రేక్షకులకు ఈ అమ్మడు గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అద్భుతమైన నటనతో సినీ ప్రియులను మెప్పించింది ఈ ముద్దుగుమ్మ. చిన్న చిన్న సినిమాల్లో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ వయ్యారికి ఇప్పటివరకు సరైన బ్రేక్ మాత్రం రాలేదు.అలాగే పెద్ద స్టార్ హీరోల సినిమాల్లో సెకండ్ హీరోయిన్ గా కనిపించింది. అంతకు ముందు ఆ తర్వాత సినిమాతో హీరోయిన్ గా తెలుగు తెరకు పరిచయమైన ఈ అమ్మడు.అమీ తుమీ, విస్మయం, బ్రాండ్ బాబు వంటి చిత్రాల్లో నటించింది. ఎన్టీఆర్ నటించిన అరవింద సమేత వీర రాఘవ మూవీలోనూ మెరిసింది.చివరిగా ఓం శాంతి శాంతి శాంతిహి అనే సినిమాలో నటించింది. ఈ సినిమా యావరేజ్ టాక్ సొంతం చేసుకుంది. ఇక సోషల్ మీడియాలో ఈ అమ్మడు చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com